ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

అన్నమయ్య
జిల్లా వార్తలు

5

ఆదివారం 5 జనవరి 2025



నేడే

ముగ్గుల పోటీలు

సిద్ధమైన వేదికలు

● ఉదయం 10 గంటల నుంచి

కడపలో: వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ఐటీఐ దగ్గర

రాయచోటిలో: అర్చన కాలేజీ, ఎగువ అబ్బవరం, గాలివీడు రోడ్డు

రాజంపేటలో: శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్, తాళ్లపాక రోడ్డు

తెలుగు సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ఉమ్మడి కడప జిల్లాలో వేదికలు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం కడప, రాయచోటి, రాజంపేట పట్టణాల్లో పోటీలు జరుగుతాయి. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరుగుతాయి. కడప నగరంలో ఐటీఐ దగ్గర వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో, రాయచోటిలో గాలివీడు రోడ్డులోని ఎగువఅబ్బవరం వద్ద ఉన్న అర్చన కాలేజీలో, రాజంపేటలో తాళ్లపాక రోడ్డులోని శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మైదానాల్లో ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. కడపలో జరిగే పోటీలకు వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో జరిగే పోటీలకు అర్చన కాలేజీ, రాజంపేటలో జరిగే పోటీలకు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. వీటితో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్నాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. ముగ్గుల పోటీల్లో విజేతలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని మూడు కేంద్రాల్లో నిర్వహించే ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పాన్సర్లు పిలుపునిచ్చారు.

ఇసుక కాజేసేందుకు పన్నాగం

● ముదివేడు రిజర్వాయర్ ఇసుక కోసం మాస్టర్‌ప్లాన్

● రూ.5 కోట్ల విలువైన ఇసుక రూ.3.65 లక్షలకే..



పిచ్చలవాండ్లపల్లె వద్ద ఇసుక నిల్వలు

కురబలకోట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రిజర్వాయర్ నిర్మాణం కోసం తరలించిన కోట్లాది రూపాయల ఇసుకను అక్రమంగా కాజేసేందుకు కొందరు మాస్టర్‌ప్లాన్ వేశారు. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ సమీపంలో గత ప్రభుత్వ హయాంలో రూ.759.50 అంచనా వ్యయంతో ముదివేడు రిజర్వాయర్ నిర్మాణ పనులను చేపట్టారు. అయితే ఈ ప్రాజెక్టుకు రైతుల నుంచి భూములను తీసుకుని వెయ్యి ఎకరాలలో నిర్మిస్తుండగా దాదాపుగా 80 శాతం వరకు పనులు పూర్తి చేశారు. రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన ఇసుకను తరలించి భారీ స్థాయిలో నిల్వలు చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి రిజర్వాయర్‌ను నిర్మాణం చేపడుతున్నారని ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో ప్రాజెక్టు నిర్మాణ పనులను నిలిపివేయాలని ఎన్‌జీటీ ఆదేశించడంతో పనులు నిలిచిపోయాయి. రెండేళ్లుగా ఎటువంటి నిర్మాణాలు జరగలేదు. దీనిపై సుప్రీంకోర్టు, హైకోర్టులలో కేసులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టులో కేసు ముగిసేవరకు ఇక్కడ ఉన్న మెటీరియల్‌ను తరలించకూడదని ఆదేశించింది. అయితే కొంతమంది ఇసుకను అక్రమంగా కారుచౌకగా కాజేసేందుకు స్కెచ్ వేసి సంబంధిత శాఖాధికారులను ఆశ్రయించినట్లు తెలిసింది. కోర్టులో కేసు ఉన్న వాటికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే అధికారం ఎవ్వరికీ ఉండదు. అయితే ఆ నిబంధనలు ఏమాత్రం పాటించకుండా మైనింగ్ అధికారులు ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దాదాపుగా అక్కడ 3 వేల టిప్పర్లకు పైగా ఇసుక నిల్వలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో ఒక్క టిప్పర్ రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పలుకుతోంది. అక్కడ నిల్వ ఉన్న ఇసుక దాదాపుగా రూ.5 కోట్లకు విలువ ఉంటుందని తెలుస్తోంది. కోట్లాది రూపాయల విలువైన ఇసుకను కేవలం రూ.3.65 లక్షలు కారుచౌకగా చెల్లించి అనుమతులు పొంది ఇసుకను తరలించేందుకు సిద్ధమయ్యారు. దీనికోసం జేసీబీతో పాటు టిప్పర్‌లను శుక్రవారం అక్కడికి తీసుకెళ్లి ఇసుకను తరలిస్తుండగా గ్రామస్థులకు విషయం తెలియడంతో తమకు భూపరిహారం చెల్లించే వరకు తరలించరాదని అడ్డుకున్నారు. ఇది వివాదం కావడంతో రెవెన్యూ, మైనింగ్ అధికారులు అక్కడికి చేరుకుని విచారించి కోర్టులో కేసు ఉండటంతో తరలించరాదని రెవెన్యూ అధికారులు తెలియజేయడంతో వెనుదిరిగి వెళ్లారు. కాగా ప్రస్తుతానికి ఇసుక తరలింపును అడ్డుకున్నా మళ్లీ పునరావృతం అయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇసుక తరలిపోకుండా అధికారులు ఏమాత్రం అడ్డుకుంటారో వేచి చూడాల్సిందే.

ఏ వస్తువునూ తరలించకూడదు..

ముదివేడు రిజర్వాయర్ పనుల వద్ద నుంచి ఇసుకను తరలించేందుకు మైనింగ్ శాఖాధికారుల నుంచి అనుమతులు పొంది కొందరు తరలిస్తుండగా అడ్డుకున్నామని తెలిపారు. కోర్టులో కేసు ఉండటంతో కోర్టు ఆదేశాల మేరకు రిజర్వాయర్ వద్ద నుంచి ఏ ఒక్క వస్తువును తరలించకూడదన్నారు. దీనికోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టి ఇసుకను కాపాడతామని తెలిపారు.

- తపస్విని, తహసీల్దార్



పిచ్చలవాండ్లపల్లె సమీపంలో నిర్మిస్తున్న ముదివేడు రిజర్వాయర్ (ఫైల్)



మామిడి రైతులకు భారీ నష్టం

● ప్రతికూల వాతావరణ మార్పులే కారణమా ?

6

● కాయల కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు

● జిల్లా అంతటా ఇదే పరిస్థితి

● ఆందోళనలో రైతులు

అవినీతి వెలుగు చూసేనా..!

● ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా జరిగేనా..?



6



కల్యాణానికి హాజరైన గోవిందమాలధారులు, భక్తులు



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం

● భారీగా హాజరైన గోవిందమాల భక్తులు

సుండుపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి కల్యాణాన్ని గోవిందమాల భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈనెల 6వ తేదీ 16వ తిరుమల మహాపాదయాత్ర సందర్భంగా కల్యాణం నిర్వహించారు. శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిలను భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలతో అలంకరించారు. అలాగే కుంకుమార్చన, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా కల్యాణ వేదికపై ఆశీనులను చేసి వేదమంత్రోచ్చారణల నడుమ మాలధారణ స్వాములు, మండల నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హాజరైన భక్తుల సమక్షంలో స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు సుమారు 4 వేల మంది కి అల్తాఫ్ హోటల్ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

పింఛన్ల ధ్రువీకరణ పక్కాగా జరగాలి : జేసీ

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు వికలాంగుల, అనారోగ్య పింఛన్ల ధ్రువీకరణ ప్రక్రియ పక్కాగా జరగాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పింఛన్ల ధ్రువీకరణ ప్రక్రియపై డీఆర్‌డీఏ పీడీ, వైద్యశాఖ తదితర అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పింఛన్ల ధ్రువీకరణ ప్రక్రియ కోసం 12 మందితో కూడిన డాక్టర్ల బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందానికి సహకారం అందించేందుకు డిజిటల్ అసిస్టెంట్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీవోల సహకారంతో ప్రక్రియ పక్కాగా జరగాలని, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. సోమవారం నుంచి మొదలు పెట్టాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి, వైద్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు అనుమతి తప్పనిసరి

గుర్రంకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రామానాయునిచెరువు నుంచి అక్రమంగా ఇసుకను తరలించడానికి అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఆంధ్రజ్యోతి పత్రికలో శనివారం 'చైర్మన్ వర్సెస్ ఇసుకాసురులు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ మదురామచంద్రుడు రైతులు, ఇసుక తరలించేవారిని చెరువు వద్దకు పిలిపించారు. ప్రభుత్వ అధికారుల అనుమతులు లేకుండా ఇసుకను తరలించకూడదని హెచ్చరించారు. రాత్రిపూట అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రైతులు, ఇసుక వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

మధ్యాహ్న భోజన పథకం పటిష్టంగా అమలు

● ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

● వైసీపీ ప్రభుత్వ హయాంలో దోపిడీలు...అరాచకాలు ● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ములకలచెరువు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ విద్యార్థులకు కూడా పటిష్టంగా అమలు చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ములకలచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. అతి త్వరలోనే ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్రీమెన్ కమిటీ వేశారని, ఇతర రాష్ట్రాల్లో అమలవున్న ఉచిత బస్సు పథకం అధ్యయనం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలో పర్యటించామని, ఇంకా పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీల్లో పర్యటించి అక్కడ అధ్యయనం చేసి అతి త్వరలోనే మెరుగైన ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సాహసోపేతర నిర్ణయం తీసుకున్నారన్నారు. మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో రాష్ట్ర విద్యా వ్యవస్థ కొత్త ఒరవడి సృష్టిస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా దోపిడీలు, అరాచకాలతో పోలీస్‌స్టేషన్లన్నీ సెటిల్‌మెంటుతో నిండిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు జరుగుతున్నాయన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేద విద్యార్థుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నేతలు విశ్వనాథరెడ్డి, కట్టా సురేంద్ర నాయుడు, తులసీధర్‌నాయుడు, నాయకులు మూగి రవిచంద్ర, జనార్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మొటుకు శివ, మస్తాన్, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, తదితరులు

ములకలచెరువులో భారీ ర్యాలీ

ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవానికి హాజరవుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. బస్టాండు సర్కిల్‌లో భారీ ఎత్తున నాయకులు స్వాగత ఏర్పాట్లు చేశారు. బస్టాండు సర్కిల్ నుంచి భారీ ర్యాలీగా జూనియర్ కళాశాల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణాసంచా పేల్చారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం

● జలపాతంలో ఒకరి మృతి

● అడవిలో పోలీసులు, అటవీశాఖ సిబ్బంది గాలింపు

● అర్ధరాత్రి విద్యార్థులను కనుగొన్న పోలీసులు





జలపాతం చూడడానికి వచ్చి శవమైన సాయిదత్

రైల్వేకోడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవిలో దారి తప్పిన విద్యార్థులను శుక్రవారం అర్ధరాత్రి 12.40 గంటలకు కనుగొన్నారు. గుంజన జలపాతం సమీపంలోని సుడిగుండంలో పడిన ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పరిధిలోని పానగల్ ప్రాంతానికి చెందిన పెద్దేశుగారి సాయిదత్ (ఓపెన్ డిగ్రీ విద్యార్థి), పట్నం గిరి (బీటెక్ విద్యార్థి), తమ్మన్నగారి కేథార్‌నాథ్ (బీటెక్ విద్యార్థి), వి.దినేశ్ (చెన్నైలో ఉద్యోగి), పి.దినేష్ (బీటెక్), ఇ.మోహన్‌క్రిష్ణ (డిగ్రీ విద్యార్థి) తమ స్వగ్రామమైన పానగల్ నుంచి రైల్వేకోడూరు మండలంలోని మాధవరంపోడుకు సుమారు 20కిలోమీటర్ల దూరం శేషాచలం అడవిలో ఉన్న గుంజన జలపాతం వద్ద రావడానికి రెండు మోటారు బైకుల్లో బయలుదేరారు. మాధవరంపోడుకు సమీపంలో ఉన్న వాగేటికోన మినీ రిజర్వాయర్ వద్ద మోటారు బైకులను పార్క్ చేసి అక్కడి నుంచి కాలినడకన గుంజన జలపాతం వెళుతుండగా నీటి ఒరవడి ఎక్కువగా ఉండడం, చీకటి పడడంతో జలపాతం వద్దకు వెళ్లలేకపోయారు. ఒక చిన్నపాటి కొండపై కూర్చున్నారు. కొండకు అతి దగ్గరలో జలపాతం నుంచి వచ్చే నీరు కుంట సుడిగుండం ఉంది. కొండపైన దగ్గర, దగ్గరగా కూర్చున్న విద్యార్థుల్లో సాయిదత్, మోహన్‌క్రిష్ణ, వి. దినేష్‌లు కూర్చున్న చోట జారి కిందపడి సుడిగుండం నీటిలో పడిపోయారు. దీంతో కేథార్‌నాథ్, పి.దినేష్, గిరి స్నేహితులను కాపాడడానికి నీటిలోకి దిగి మోహన్‌క్రిష్ణ, వి.దినేష్‌లను కాపాడారు. సాయిదత్ జాడ కనిపించలేదు. బాగా లోతుగానే వెతికారు. పెద్ద సుడిగుండంలో చిక్కుకుని సాయిదత్ (26) మృతి చెందాడు. ఏమి చేయలేని సమయంలో పి.దినేష్ పది కిలోమీటర్లు నడుచుకుని సెల్‌ఫోన్ సిగ్నల్స్ వచ్చే ప్రాంతానికి వచ్చి బంధువులు, 108కు సమాచారం అందించి లోకేషన్ పంపాడు. తిరిగి స్నేహితులు ఉన్న ప్రాంతానికి చేరుకుని మళ్లీ సాయిదత్ ఆచూకీని నీటిలో వెతికారు. ఎక్కడా జాడ కనిపించకుండాపోయింది. కొన్ని గంటల తర్వాత శవం నీటిపై తేలియాడింది. శవాన్ని బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందరరావు, రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్‌బాబు, సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సిబ్బంది కలసి అడవిలో గాలింపు చర్యలు చేపట్టి అర్ధరాత్రి 12.40 గంటలకు వారు ఉన్న చోటును కనిపెట్టారు. తెల్లవారుజామున 4.30 గంటలకు వారంతా రైల్వేకోడూరుకు చేరుకున్నారు. దీంతో ఇటు పోలీసులు, అటు అటవీశాఖ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అడవిలో దారి తప్పిన విద్యార్థులను రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. సాయిదత్ శవాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష కోసం తరలించారు. సెక్షన్ 174 కింద ప్రమాదవశాత్తు సాయిదత్ చనిపోయినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నవీన్‌బాబు తెలిపారు. సాయిదత్ కుటుంబ సభ్యులు, ఇతర విద్యార్థుల కుటుంబ సభ్యులు రైల్వేకోడూరుకు చేరుకున్నారు. సాయిదత్‌కి తల్లి లత, తండ్రి ఈశ్వర్‌రెడ్డి, ఒక చెల్లెలు ఉన్నారు. తిరుపతి జిల్లా పానగల్‌లో సాయిదత్ మృతితో శోకసంద్రం లో మునిగిపోయింది. తల్లి, తండ్రి, చెల్లెలు, బంధువులు తల్లడిల్లిపోయారు.



శేషాచలం అడవిలో విద్యార్థుల ఆచూకీ తెలుసుకుని వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నాణ్యమైన భోజనం అందించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్

రాయచోటిటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాల మెరుగునకు, విద్యార్థుల్లో సృజనాత్మకతకు నాణ్యమైన భోజనమే పునాది అని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత విద్యాశాఖలో పెనుమార్పులు వచ్చాయని, అందులో భాగంగానే జూనియర్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు తిరిగి భోజన పథకాన్ని ప్రారంభించారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు బాగా చదువుకోవాలంటే నాణ్యమైన భోజనం ఎంతో అవసరమన్నారు. వారంలో ఆరు రోజుల పాటు ఈ భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీంతో పాటు రాగిజావ కూడా అందించబడు తుందన్నారు. రాయలసీమ, కోస్తా, ఆంధ్ర తదితర ప్రాంతాల పిల్లలు తినే విధంగా అక్కడి పరిస్థితులు బట్టి భోజనాలను తయారు చేస్తున్నారన్నారు. తాను చదువుకునేటప్పుడు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకువచ్చే వాడినని, అటువంటి ఇబ్బందులు ఏమీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాల విద్యార్థుల స్థాయి వరకు అందిస్తోందన్నారు. ఈ పథకాన్ని విద్యా ర్థులు ఉపయోగించుకొని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిం చారు. కాగా జేసీ విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించి అనంతరం కళాశాలలోనే భోజనం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి కృష్ణయ్య, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు భారీ నష్టం

● ప్రతికూల వాతావరణ మార్పులే కారణమా?
● కాయల కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
● జిల్లా అంతటా ఇదే పరిస్థితి
● ఆందోళనలో రైతులు

పెనగలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు ప్రతికూల వాతావరణ మార్పులతో మామిడి రైతులకు భారీ నష్టం సంభవించ వచ్చని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాల సీజన్ ముగిసి తోటలు పూతలతో కళకళలాడాల్సిన సమయంలో కాండానికి మొగ్గ వస్తున్న లక్షణాలు కూడా కనిపించ లేదని వాపోతున్నారు. దీంతో కాయల కొను గోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఎన్నో ఆశలతో పంటను సాగు చేస్తారు. పంట దిగుబడి బాగా వస్తే చేసిన అప్పులు తీర్చేద్దామనుకుంటారు. కానీ పంట చేతికొచ్చే వరకు ఏ ముప్పు ఎటునుంచి వస్తుందో తెలియదు. ఇప్పుడు ఇదే పరిస్థితి మామిడి రైతుల్లో కనిపిస్తోంది. ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా మామిడి పంట దెబ్బతింది. తోటలు పూతలతో కళకళలాడాల్సిన సమయంలో కాండానికి మొగ్గలు రాక దిగాలు చెందుతున్నారు. నవంబరు ముగిసిన సమయానికి మొగ్గలు రావడానికి క్రిమిసింహారక మందులను పిచికారి చేయాల్సి ఉంది. అలాగే డిసెంబరు వారంలోనూ, జనవరి 1, 2 వారాల్లో మొగ్గలు విచ్చిన పూతకు పురుగు పట్టకుండా మందు పిచికారి చేయాల్సి ఉంది. ఈ ఏడు భిన్నమైన ప్రతికూల వాతావరణంతో మొగ్గ, పూత దశలో చేయాల్సిన 2 సార్లు పిచికారి పనులు రైతులు నిలిపివేశారు. వాతావరణం అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటే ఇంకో 20 రోజుల తర్వాత మందులు పిచికారీ చేయాలని రైతులు భావిస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు గత మూడేళ్ల నుంచి తోటల్లో కాయలు కాయక మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారని, ఈ ఏడు కూడా అదే పరిస్థితి దాపురిస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. గత మూడేళ్ల నుంచి రైతులు మామిడి తోటలకు సేద్యపు పనులు, ఎరువుల తోలకం, సస్యరక్షణ చర్యలు తదితర సేద్యపు ఖర్చులకు భారీగా పెట్టుబడులు పెట్టుకుంటూ వస్తున్నారు. గత రెండేళ్ల నుంచి నష్టాలను చవిచూస్తున్న రైతులు ఈ ఏడు కూడా అదే పరిస్థితి ఎదురైతే ఎలా అని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా కాయలు కాయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు.



ఈటమాపురం వద్ద ఇంకా పూతకు రాని మామిడి తోట



మొగ్గలైనా కనిపించని ఖాదర్ రకం చెట్టు

ఐదేళ్లుగా నష్టాలను చవిచూస్తున్నాం

- రెడ్డెయ్య, రైతు, ఎగువ సిద్ధవరం



నాకు 10 ఎకరాల మామిడి తోట ఉంది. ప్రతి ఏడు తోటలకు సస్యరక్షణ చర్యలు, ఎరువుల వాడకం, సేద్యపు పనుల కోసం ఎకరాకు రూ.లక్ష ఖర్చు వస్తోంది. ఐదేళ్లకు మునుపు ఎకరాకు 5 టన్నుల కాయలు దిగుబడి వచ్చేది. గత నాలుగేళ్ల నుంచి దిగుబడి బాగా పడిపోయి ఎకరాకు కనీసం రెండు టన్నుల కాయలు కాయడం రావడం లేదు. ఏ ఏడాది పరిస్థితి చూస్తే భయమేస్తోంది. కనీసం సేద్యపు ఖర్చులు అయినా వస్తాయో రావో అని ఆందోళనగా ఉంది.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

- సురేష్‌బాబు, ఉద్యానశాఖ అధికారి, రాజంపేట డివిజన్



జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో 35,863 హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఫిబ్రవరి నెల నుంచి పొడి వాతావరణం ఏర్పడినప్పుడు పూత, పిందె బాగా ఏర్పడుతుంది. మామిడిలో సస్యరక్షణ చర్యలు గురించి ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించాం. డిసెంబరు నెలాఖరు వరకు హెక్టారుకు రూ.2250తో క్రాప్ ఇన్సూరెన్స్ చేయించాం. ఒకవేళ రైతులకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం రూ.45 వేలు పరిహారం ఇస్తుంది. చాలామంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు.

వ్యాపారులు మొగ్గు చూపడం లేదు

- రవికుమార్, వ్యాపారి, ఈటమాపురం



తోటల్లో మొగ్గలు, పూత పుష్కలంగా కనిపిస్తున్నప్పుడు వ్యాపారులు పిందె, కాయలను అంచనా వేసి ముందుగానే తోటలపై పెట్టుబడి పెట్టేవారు. గత రెండేళ్ల నుంచి ఆ పరిస్థితి లేదు. అంచనాలు తలకిందులు అయితే భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. అందువల్ల వ్యాపారులు ముందస్తుగా కొనుగోలుకు మొగ్గు చూపడం లేదు. మాకు దిక్కుతోచడం లేదు.

7న జిల్లా స్థాయి రంగోత్సవ్ వేడుకలు

రాయచోటిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఈ నెల 7న ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ (2024-25) సంబరాలు ఉంటాయని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగోత్సవ్ సాంస్కృతిక, సృజనాత్మక పోటీలు విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వారి సాంస్కృతిక భావనను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తామ న్నారు. ఈ పోటీలకు సంబంధించి సమా చారం కోసం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వైసీ రెడ్డెప్పరెడ్డి (8008215541), కె.దేవి లెక్చరర్ (9441228359)ను సంప్రదించాలన్నారు. రంగోత్సవ్ (2024-25) సంబరాల్లో ప్రధా నంగా 8 విభాగాల్లో పోటీలు నిర్వహించ బడతాయని, క్విజ్ పోటీలు, చిత్రలేఖనం, హస్తప్రతిలిపి, రంగోలి, డిజిటల్ కలాజ్, స్లోగన్ రచన, రోల్‌పే పోటీలు ఉంటా యన్నారు. ఏపీలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీకి 1 గంట ముందు హాజరుకావాలని, అవ సరమైన పరికరాలు, సామగ్రి విద్యార్థులే తెచ్చుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొం దిన విజేతలకు ట్రోఫీలతో పాటు సర్టిఫికెట్స్ కూడా ఇస్తామన్నారు. ప్రతి డైట్ స్థాయిలో మొదటి, రెండవ, మూడు బహుమతి విజే తలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులన్నారు. డైట్ స్థాయి పోటీల అనంతరం జిల్లా స్థాయి పోటీలు జనవరి 8న ఉంటాయని, ఆసక్తి గల పూర్వపు కడప జిల్లా (అన్నమయ్య, కడప)లోని విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన వచ్చని ఆయన తెలియజేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు మృతి

లింగాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని రామన్నూతలపల్లెలో లోమడ గురుడు (18) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురుడు తండ్రి సూర్యుడు, పోలీసుల కథనం మేరకు... డిసెంబరు 31న రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో గురు డును అదే గ్రామానికి చెందిన కొందరు దూషించిన విషయం విధితమే. ఈ నేప థ్యంలో మృతుడు మనస్తాపానికి గురై పురు గుల మందు తాగాడు. ఈ మేరకు కర్నూ లులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూద న్‌రావు తెలిపారు.

11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎర్రచం దనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఒక స్మగ్లరును పట్టుకోవడమే కాకుండా ఒక వాహనం, 11 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ శనివారం తెలిపారు. ఎర్ర చందనం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో తాము శనివారం ఉదయం చిత్తూరు జిల్లా పులిచెర్ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఏపీ03 ఏఎం 9009 హోండా సీటీ కారును ఆపినా ఆపకుండా మంగళంపేట వైపు వెళ్లిపోయిందన్నారు. దాన్ని వెంబడించగా అందులో ఉన్న వ్యక్తులు కారును వదిలి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. కానీ తమిళనాడు రాష్ట్రం, విల్లాపురానికి చెందిన ఎ.సతీశ్(22) అనే స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నా మన్నారు. అనంతరం కారును పరిశీలించగా అందులో 320 కిలోల బరువున్న ఎర్ర చందనం దుంగలు ఉన్నాయని, కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నట్లు వివరించారు.

పకడ్బందీగా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

● పర్యవేక్షించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



ఎంపికలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కడప క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలను ఐదో రోజు శనివారం కడప ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవే క్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమనరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థు లకు ఫిజికల్ మెజర్‌మెంటు, ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టు లకు ఉమ్మడి జిల్లాలో 4492 మంది అభ్యర్థులు పాల్గొం టున్నారన్నారు. ఐదోరోజు శనివారం 600 మంది అభ్యర్థు లకు గాను 373 మంది పరీక్షలకు హాజరు కాగా, 229 మంది క్వాలిఫై అయ్యారన్నారు. దేహదారుఢ్య పరీక్షల వద్ద ఎక్కడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్‌ఎఫ్‌ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిష నల్ ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్ ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఐటీ కోర్ టీం, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

● కొడవలి, చాకు, కర్రలతో దాడి ● ఇరువురికి గాయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణలో ఇరువురు గాయపడిన సంఘటన శనివారం రెడ్డివారిపల్లె పంచాయతీలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామంలో భూ విషయంగా గతంలో మరొకరికి సాక్ష్యం చెప్పామనే నెపంతో నిమ్మనపల్లె మండలం, రెడ్డివారిపల్లె పంచాయతీ, దిన్నేపల్లెలో కోర్టు తీర్పు వచ్చిన భూమిలో వ్యతిరేక వర్గీయులు ట్రాక్టర్‌తో దున్నే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడికి వెళ్లి అడ్డుకున్న వారిని కర్రలతో కొట్టి చాకుతో చేతిపై పొడిచారని, ట్రాక్టర్‌తో తొక్కిస్తా మని బెదిరించారని ఆరోపించారు. ఈ ఘర్షణలో గాయపడిన వారిని కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రవిబాబు, శ్రీరాములు కుటుంబసభ్యులు నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఈ విషయమై నిమ్మనపల్లె హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తిని వివరణ కోరగా.. బాధితుల ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని, కేసు నమోదు చేయలేదన్నారు.

రామాలయంలో విజిలెన్స్ విచారణ

ఒంటిమిట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరు గాంచిన కోదండరామాలయంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిపోయిన ఇనుప రేకులు, ఇనుప వస్తువులు, ఇతర సామాన్లు మాయం చేశారన్న ఫిర్యాదుపై టీటీడీ విజిలెన్స్ ఎస్‌ఐ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కోదండరామాలయంలో శనివారం విచారణ చేపట్టారు. కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు.. సౌమ్యనాథస్వామి ఆలయం, దేవునికడప, తాళ్లపాకలో అనుమతులు లేకుండా పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారని ఇంజనీరింగ్ అధికారులపై విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచా రణ చేపట్టారు. సౌమ్యనాథస్వామి ఆలయం ధ్వజస్తంభం మార్పిడి చేయకుండానే మార్చినట్లుగా బిల్లులు చెల్లించారని క్షేత్రస్థాయిలో నిర్ధారణకు వచ్చారు. రామాలయంలో ఇనుప వస్తువులను ఇంజ నీరింగ్ అధికారులు తరలించారని అప్పటి కాంట్రాక్టర్‌లు అధికారు లను వివరించారు. తుది నివేదికను టీటీడీ విజిలెన్స్ అధికారులకు అందజేస్తామని టీటీడీ విజిలెన్స్ అధికారులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక బావిలోకి దూకి మహిళ ఆత్మహత్య



మృతిచెందిన రెడ్డిజ్యోతి

నిమ్మనపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక గ్రామ సమీపంలోని బావిలోకి దూకి మహిళ ఆత్మహత్య చేసుకొన్న సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకొంది. కొండయ్య గారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లికి చెందిన శివారిపల్లి రెడ్డిజ్యోతి(25)ని వాల్మీకిపురం మండలం పత్తేపురానికి చెందిన తన మేన మామ కిరణ్‌కుమార్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే రెడ్డిజ్యోతి తన పుట్టిల్లు అయిన కొమ్మిరెడ్డిగారిపల్లికి రెండు రోజుల క్రితం వచ్చింది. కాగా శనివారం ఉదయం కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఆ నొప్పిని భరించలేక సమీపంలో వున్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన గ్రామస్తులు ఆమెను కాపాడేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతురాలికి ఒక కుమారుడు వున్నాడు. మృతురాలి తల్లి రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జిలానీబాషా తెలిపారు.

జాతీయ హైవేపై రెండు కార్లు ఢీ

● ఇరువురికి గాయాలు





చెరువుకట్టపై దెబ్బతిన్న వాహనాలు, (ఇన్‌సెట్లో) గాయాలపాలైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఓబులవారిపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లె చెరువుకట్ట సమీపంలో 2 కార్లు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. హైవే మొత్తం గుంతలమయం కావడంతో గుంతలు తప్పించుకుని వెళ్లే క్రమంలో అదుపు తప్పి ఇరు వాహనాలు ఢీకొన్నాయి. కడప వైపు నుంచి ఏపీ39ఎంకె 7111 క్రెటా కారులో పుష్పమి అను సాఫ్ట్‌వేర్ యువతి కుటుంబం భర్త, పసిబిడ్డతో హైదరాబాదు నుంచి తిరుపతికి వెళుతున్నారు. తిరుమల శ్రీవారి దర్శనం నుంచి నంద్యాలకు ఏపీ 21ఎబి 6666 నంబరు గల ఇన్నోవా కారులో మరో కుటుంబం వెళుతున్నారు. వారి దారిలో వెళ్లాల్సిన వాహనం గుంతలు తప్పించేందుకు మరో దారిలో వెళ్లగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో ఇరువాహనాల ఇంజన్లు దెబ్బతిన్నాయి. ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పి గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహేష్ సిబ్బందితో వచ్చి క్షతగాత్రులను అంబులెన్సులో రాజంపేట ఆసుపత్రికి తరలించారు. అనంతరం రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అవినీతి వెలుగు చూసేనా...!

● బినామీ పేర్లు బయటకు వచ్చేది ఎప్పుడు ? ● సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా జరిగేనా..?



గుర్రంకొండలో ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

గుర్రంకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో సామాజిక తనికీ బృందం అవినీతిని వెలికితీయగలరా అన్న చర్చ మండల ప్రజల్లో చర్చనీయాం శంగా మారింది. ఉపాధిహామీ పథకంలో ఏడాదిపాటు జరిగిన పనులపై సామాజిక తనికీ బృందం తనిఖీలు చేయనుంది. ఈ క్రమంలో గుర్రంకొండ మండలంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన వివిధ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు కూలీలు, ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం వారం రోజుల పాటు కూలీలు చేసిన ప్రతి పనిని తనిఖీ చేయనుంది. ఈ తనిఖీ బృందం నిష్పక్షపాతంగా చేస్తే లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము రికవరీ అవుతుందని నాయకులు, కూలీలు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయితీలున్నాయి. ఈ పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో 2023 ఏప్రిల్ 1వ తేది నుంచి 2024 మార్చి 30వ తేది వరకు జరిగిన వివిధ పనులను సామాజిక తనికీ బృందం తనిఖీ చేయనుంది. ఈ ఏడాది పాటు కూలీలు చేసిన పనులకు రూ.5.22 కోట్లు, మెటీరియల్ పనులకు గానూ రూ.2.50 కోట్లు మొత్తం రూ.7.77 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో చానల్ పనులు, ఫారంపాండ్స్, సచివాలయాల నిర్మాణం, ఆర్బీకేలు, డ్రైన్లు, సీసీరోడ్లు, నాడు-నేడు, చెరువుల పూడికతీత పనులను చేశారు. ఈ పనులను కొందరు వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టు కొని ఇష్టానుసారంగా చేశారు. ఈ క్రమంలో ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలు అధికంగా జరిగినట్లు టీడీపీ నాయకులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం సామాజిక తనిఖీ బృందం సభ్యులతో కలిసి ఉపాధి సిబ్బందికి కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి ఉపాధిహామీ పనులను తనిఖీ చేయనుంది.

10 మందికి.. మరో ఐదుగురు

ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కూలీలకు ప్రతి రోజు మస్టర్‌ను వేస్తారు. ఈ మస్టర్‌ను పని ప్రదేశంలో కూలీల పేర్లను నమోదు చేసి అటెండెన్స్ వేస్తారు. మస్టర్‌లో కూలీల పేర్లను పూర్తి చేసిన తరువాత ఖాళీ ప్రదేశంలో పనిచేయని కూలీల పేర్లను ఫీల్డ్ అసిస్టెంట్లు వారంలో చివర రోజున బినామీ పేర్లను నమోదు చేస్తారు. ఈ క్రమంలో పని చేయని కూలీల పేర్లను ఐదు నుంచి పది మంది పేర్లను మస్టర్‌లో చేర్చి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకున్నారు. ఇలా మండలంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, వైసీపీ నాయకులు కలిసి ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో మస్టర్లలో బినామీ పేర్లతో సిబ్బంది, నాయకులు లక్షలు గడించారు. సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తే అవినీతి బయటకు వస్తుందని కూలీలు గుసగుసలాడుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమాలను వెలికితీస్తాం

ఉపాధిహామీ పథకంలో వివిధ పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తాం. ప్రతి కూలీతో మాట్లాడి పనులు చేసిన తీరును ఆరాతీస్తాం. అలాగే మస్టర్లలో బినామీ పేర్ల విషయంలో క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలను వెలికి తీసేందుకు సామాజిక తనిఖీ బృందం పనిచేస్తుంది.

-సుబ్బారావు, ఎస్‌ఆర్పీ, సామాజిక తనిఖీ బృందం సభ్యులు

బావబామ్మర్దుల మధ్య ఘర్షణ

● ఒకరి కత్తిపోటు ● పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహబూబ్‌బాషా

కడపక్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రెండో గాంధీబొమ్మ వద్ద బైకు తాళం విషయమై బావబామ్మర్దులు పరస్పరం ఘర్షణ పడ్డారు. దీంతో బామ్మర్ది ఎదపై బావ పిడిబాకుతో పొడవడంతో చికిత్స నిమిత్తం అతన్ని రిమ్స్‌కు తరలించగా, పరి స్థితి ఆందోళనకరంగా ఉండడంతో కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు. వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ నాగార్జున విషయం తెలుసుకుని ఎస్‌ఐ హుసేన్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ వివరాల మేరకు.. గుర్రాలగడ్డకు చెందిన మహబూబ్‌బాషా తన సోదరిని కడప తిలక్‌నగర్‌కు చెందిన రియాజ్‌బాషాకు ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం చేశాడు. అయితే భార్య, భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడంతో శుక్రవారం గొడవ పడి ఆమె పుట్టింటికి వచ్చింది. కాగా శనివారం బావాబామ్మర్దులు కలిసి మద్యం సేవించి ఆటోలో గుర్రాలగడ్డకు వెళుతుండగా రెండో గాంధీబొమ్మ వద్దకు రాగానే బుల్లెట్ బండి తాళం విషయమై ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో రియాజ్ వద్ద ఉన్న పిడిబాకుతో మహబూబ్ బాషా ఎదపై గట్టిగా పొడవడంతో రక్తస్రావమైంది దీంతో ఒక్క సారిగా కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి వారు రిమ్స్‌కు తరలించగా రిమ్స్ వైద్యుల సూచనల మేరకు మహబూబ్‌బాషాను కర్నూలుకు రెఫర్ చేశారు. నిందితుడు అక్కడి నుంచి పరారీ అయ్యాడు. అయితే నిందితుడి కోసం సీఐ నాగార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కాగా రియాజ్‌కు నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

వినియోగం అనర్థం


పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల


(ఏబీఎస్పీ) పరీక్ష కిట్టు

- వ్యాధుల నివారణకు అధిక మోతాదుల్లో యాంటిబయాటిక్స్
- వ్యాధి నిర్ధారణ తర్వాతే వాడాలంటున్న నిపుణులు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే వ్యాధులకు తొందరగా నయం చేయాలన్న ఆతృతతో పోషకులు యాంటీబయాటిక్స్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఫలితంగా వ్యాధులు తగ్గకపోగా బ్యాక్టీరియా వైరస్ బలపడి యాంటీబయాటిక్స్‌కు కూడా లొంగని పరిస్థితి ఏర్పడుతోంది. పశువులకు వ్యాధులు వచ్చినప్పుడు యాంటిబయాటిక్స్ సెన్సిటివ్ టెస్ట్ (ఏబీఎస్పీ) చేయించాకే మందులు వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో మున్ముందు రోగాలు మరింత ప్రమాదకరంగా మారుతాయని హెచ్చరిస్తున్నారు. వ్యాధులు న్న పశువుల పాలు, మాంసం ద్వారా మనిషులకు చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

- జిల్లావ్యాప్తంగా పశువుల్లో వచ్చే చిన్న చిన్న వ్యాధులకు సైతం అధిక మోతాదుల్లో యాంటిబయాటిక్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది.

సూక్ష్మమైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు మానవులు, పశువుల శరీరం లోపల, బయటా ఉంటాయి. వీటిని మైక్రోస్ అని పిలుస్తారు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటానికి, రోగ నిరోధక శక్తి సక్రమంగా ఉండేందుకు మేలు చేసే బ్యాక్టీరియా, వైరస్‌లు తోడ్పడతాయి. పశువుల శరీరానికి హానిచేసే బ్యాక్టీరియాల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడానికి పోషకులు యాంటిబయాటిక్స్‌పై ఆధారపడుతున్నారు. నిర్దేశిత మోతాదు, నిర్ణీత కాలం కాకుండా ఇష్టానుసారం అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

సీజనల్ వ్యాధులు

ప్రస్తుత శీతాకాలంలో పశువులు, జీవాల్లో గొంతువాపు, గాలికుంటు, లింపిస్కిన్ సహా పాడిపశువులకు పొదుగువాపు వ్యాధి, జీర్ణసంబంధ, గర్భకోశ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. వీటికి టీకాలు, యాంటీబయాటిక్స్ ద్వారా వైద్యం చేస్తారు. పశువుల వ్యాధులపట్ల పోషకులు మందులను ఇష్టానుసారం వాడకూడదని వైద్యుల సూచనలపై వాడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పరీక్షల తర్వాత వాడితే మేలు

పశువుల్లో వ్యాధి వస్తే నమూనాలు సేకరించి యాంటిబయాటిక్స్ సెన్సిటివ్ టెస్ట్ (ఏబీఎస్పీ) చేయించాలి. రోగ నిర్ధారణకు రక్తం, పాలు, చీము, చీమిడి, ముక్కునుంచి కారే రసాలను నమూనాలుగా సేకరించి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో 14 రకాల యాంటీబయాటిక్స్‌ల్లో ఏ మందులు వాడాలో పరీక్ష ఫలితం సూచిస్తుంది. ఫలితాల ఆధారంగా మందులు వాడాలి. దీంతో పోషకులకు ఖర్చు తగ్గుతుంది. పశువులు త్వరగా కోలుకుంటాయి. పరీక్షల ద్వారా నిర్ధారణ చేయకుండా ఒకటి పనిచేయకపోతే మరొకటి అన్నట్లుగా వాడితే ఇబ్బందులు, ఎదురవుతాయని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు వైద్యుల సూచనల మేరకు నిర్ణీత కాలం సగటున 3 నుంచి 5 రోజులు మందులు వాడకంతో ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో ఏబీఎస్పీ తప్పనిసరని వైద్యులు సూచిస్తున్నారు.

పరీక్షలు ఉచితమే

పశువైద్యులు నమూనాలను సేకరించి నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న పశుసంవర్ధక ప్రయోగశాలలకు పంపితే పరీక్షలు చేసి పశువులకు ఏ జబ్బులు వచ్చాయో నిర్ధారిస్తారు. ఏ యాంటి బయాటిక్ పనిచేస్తుందో 24 గంటల నుంచి 48 గంటల వ్యవధిలో నివేదిక ఇస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ఉచితమే.

పశువుల నుంచి మనుషులకు వ్యాప్తి



మితిమీరి యాంటిబయాటిక్స్ వాడకంతో అటు పశువులకేకాక వాటి ద్వారా మనుషులకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ఎక్కువ మోతాదులో యాంటిబయాటిక్స్ వాడకంతో గొర్రెలు, మేకలు వ్యాధి నిరోధకశక్తిని కోల్పోతాయి. వాటి మాంసం తినేందుకు పనికిరాదు. ఆ పాలను తాగిన దూడల్లో కూడా రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతుంది. పాలను తాగితే చిన్నపిల్లలు, పెద్దల్లో డయేరియా, వాంతులు, విరేచనాలు, జీర్ణసంబంధిత వ్యాధులు, హార్మోన్లపై ప్రభావం తదితర దుష్ఫలితాలు ఉంటాయి.

డాక్టర్ ధనుంజయరెడ్డి, సహాయ సంచాలకుడు

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

- మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య కోరారు. సీడాప్ ద్వారా మైనార్టీ యువతకు నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు తమ వివరాలను ఎస్ఈఈడీఏపీ.ఏపీ..ఈఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్, కెరీర్ కౌన్సెలింగ్‌లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. దరఖాస్తు, నకలు జతచేసి మూడు కాపీలను కార్యనిర్వాహక సంచాలకులు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, 'డి' బ్లాక్ న్యూ కలెక్టరేట్, కడప-516004 చిరునామాకు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 08562-2411375ను సంప్రదించాలని సూచించారు.

శస్త్రచికిత్సలో వైద్యురాలి నిర్లక్ష్యం

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌తో పేగుకు ఇన్‌ఫెక్షన్
హైదరాబాదులో చికిత్సకు రూ.10లక్షలు వ్యయం
వైద్యురాలిపై విచారణ చేపట్టిన అధికారులు


విచారణ అధికారులతో మాట్లాడుతున్న బాధితురాలు

ప్రొద్దుటూరు , జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యురాలి నిర్లక్ష్యంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మహిళ పేగు ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. బాధితురాలు హైదరాబాద్‌లో రూ. 10 లక్షలు ఖర్చు చేసిన సంఘటన వెలుగు చూసింది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియారాణీపై బాధితురాలు కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదుపై కడప రిమ్స్ నుంచి వైద్య అధికారులు వచ్చి బాధితురాలు, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఇలియారాణిని శనివారం విచారించారు. వివరాల్లోకెళితే...

చాపాడు మండలం నక్కల దిన్నె వాసి శివలక్ష్మి 2024 అక్టోబరు 29న ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. అదే రోజు డిశ్చార్జి చేసి పంపారు. ఇంటికి వెళ్లాక వరుసగా వాంతులవుతున్నాయని ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియారాణికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఆ మరుసటి రోజు మళ్లీ ఆస్పత్రికి రాగా ఎక్స్‌రే తీసి గ్యాస్ ట్రబుల్ సమస్య వుందని మందులిచ్చి పంపారు. కానీ కడుపు నొప్పి పెరుగుతోందని నవంబరు 2న మళ్ళీ డాక్టర్‌ను సంప్రదిస్తే స్కానింగ్ చేసి సమస్య ఏమీ లేదని తెలిపారు. డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని గుర్తించి ప్రైవేటుగా స్కానింగ్ చేయించుకోగా ఆపరేషన్‌తో పేగు దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు వెళ్లి మరో సర్జరీ చేయించుకున్నారు. దాదాపు వారికి రూ.10 లక్షలు ఖర్చు అయినట్లు తెలిపారు. రెండో విడత సర్జరీ కూడా చేయాల్సివుందని హైదరాబాద్ వైద్యులు తెలిపినట్లు వెల్లడించారు. పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు బాధితురాలు శివలక్ష్మి, ఆమె భర్త విశ్వనాధరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో రిమ్స్ కళాశాలకు చెందిన డాక్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో ఒక రేడియాలజిస్టు, సర్జన్, గైనకాలజిస్టు విచారణ బృందం బాధితురాలు శివ లక్ష్మిని విచారించారు. డాక్టర్ ఇలియా రాణిని కూడా ప్రత్యేకంగా ఆమె చాంబర్‌లో విచారించారు. ఇదిలావుండగా పీపీ యూనిట్ విచారణకు వచ్చిన బాధితురాలు శివలక్ష్మి తన భర్త విశ్వనాథ్‌రెడ్డితో కలిసి డాక్టర్ ఇలియారాణి చాంబర్‌కు వెళ్లి తమకు జరిగిన అన్యాయంపై నిలదీశారు. వాగ్వాదం చేసుకోవడంతో డాక్టర్ ఇలియా రాణి అక్కడి నుంచి వెళ్లి పోయింది.

ప్రాజెక్టులను విస్మరిస్తే పోరు తప్పదు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్



సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీమ సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం విస్మరిస్తే పోరుబాట తప్పదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ హెచ్చరించారు. శనివారం సీపీఎం జిల్లా 12వ మహాసభల సందర్భంగా జియోన్ కళాశాల నుంచి ఐటీఐ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజించు పాలించు పద్ధతిలో ప్రజల మధ్య మత వైషమ్యాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందన్నారు. రాష్ట్రంలోని ప్రకృతి వనరులన్నీ అదానీకి తాకట్టు పెట్టడానికి ప్రయత్నిస్తోందన్నారు. పోర్టులు అదానీ పరమయ్యాయి, వేలాది ఎకరాలు అదానీకి కట్టబెడుతున్నారన్నారు. కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. విభజన చట్టం హామీలు దశాబ్దాల తరబడి వెనుకబడిన ప్రాంతాల్లో ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. ఏపీలోని కూటమి సర్కార్ మౌనంగా ఉండడం సరైంది కాదన్నారు. కార్పొరేట్ల కోసమే జమిలీ ఎన్నికలను తెచ్చేందుకు మోదీ చూస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పిలుపునిచ్చారని, అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు ఊసే లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురవుతోందని, జిల్లాలో రైతాంగం ఆత్మహత్యల పరంపరం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బహిరంగ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, బి.మనోహర్, శివకుమార్, ఐఎం సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, శివకుమార్, తదితర సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి


ముస్తఫా మృతదేహం

పులివెందుల టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ సమీప వంకలో దిగి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... కదిరి నియోజకవర్గం పట్నం వాసి ముస్తఫా రెండేళ్ల నుంచి సుబ్రమణ్యం వద్ద పశువులు మేపుతూ ఉండేవాడు. రోజు మాదిరిగానే పశువులు మేపేందుకు ముస్తఫా పశువులను తీసుకుని రోటరీపురం సమీపంలోకి వెళ్లాడు. అక్కడ పశువులు వంకలోకి దిగాయని ముస్తఫా కూడా దిగడంతో ఆయనకు ఈత రాక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ విష్ణు ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆ ప్రాంతంలోని వారిని అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వన్‌స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

కడప రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్‌సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సవిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. రిమ్స్ ఆవరణలోని వన్‌స్టాప్ సెంటర్‌ను శనివారం జడ్జి విజిట్ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో ఒకేచోట అనేక సేవలను అందిస్తామన్నారు. చట్టపరమైన సలహాలు, మానసిక సలహాలు, పోలీసుల సహాయం, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం పొందవచ్చన్నారు. ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు, హెల్ప్‌లైన్ నెంబరు 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నెంబరు 14456పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ సెలక్షన్ నేషనల్ కమిటీ సభ్యుడిగా జనార్ధన్



కడప స్పోర్ట్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరగనున్న 50వ ఆంధ్ర రాష్ట్ర కబడ్డీ జూనియర్స్ బాల, బాలికల నేషనల్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జనార్ధన్ ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ పద్మజాబాల నియమించినట్లు వెల్లడించారు. జనార్ధన్ నియామకం పట్ల జిల్లా అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు శిల్పారామానికి టీవీ యాంకర్ల రాక

కడప కల్చరల్ జనవరి 4, (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై ప్రత్యేకంగా ఆకర్షణగా టీవీయాంకర్లు శ్రీయుక్తా, అమూల్య రానున్నట్లు పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. శిల్పారామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం జరగనున్న కార్యక్రమాలకు కడప నృత్య కళాకారిణి విజయశాంతి బృందం కళాకారులు శాస్త్రీయ, జానపద, కూచిపూడి, సినీ గీతాలకు అభినయించనున్నారన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ జరగనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమాలను దిగ్విజయం చేసేందుకు ప్రజలు హాజరవాలని కోరారు.

అధికారుల సమక్షంలో పోస్ట్‌మార్టం

మైదుకూరు రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అధికారుల సమక్షంలో శెట్టివారి పల్లె వాసి అల్లాడుపల్లె వీరారెడ్డి (75) మృతదేహాన్ని గుంత నుంచి వెలికి పోస్ట్‌మార్టం చేశారు. డిసెంబరు 6న తండ్రి మృతి చెందడంపై వీరారెడ్డి కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దినేష్, తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎస్ఐ చిరంజీవి తదితర అధికారుల పాల్గొన్నారు.

కొండాపురంలో స్టాపింగ్ పొడిగింపు

కొండాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-ధర్మవరం రైళ్లను కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆరునెలల పాటు స్టాపింగ్ పొడిగించారు. ఆదివారం నుంచి ఆరు నెలలు స్టాపింగ్‌ను పొడిగిస్తారని, ప్రతి ఆరునెలలకు ఒకసారి రైల్వేశాఖ రివ్యూ చేస్తూ కొండాపురంలో స్టాపింగ్‌ను పొడిగిస్తూ వస్తోంది. కాగా ఈ రైలు విజయవాడ, గుంటూరు వెళ్లేందుకు సీమ ప్రజలకు ఎంతో ఉపయుక్తం.

పశువుల రోదన.. పోషకుల వేదన

● రాయవరంలో అవుట్‌సోర్సింగ్ అటెండరే వైద్యుడు ● పింఛా ఆసుపత్రిలో వైద్యుడు, సిబ్బంది కరువు ● గ్రామాల్లో గోపాలమిత్రలే దిక్కు



వాన నీటిలో, పిచ్చిమొక్కల మధ్య, పాడుబడిన భవనంలో రాయవరం పశువైద్యశాల



గ్రామ పంచాయతీ కార్యాలయ పాత భవనంలో నిర్వహిస్తున్న పింఛా పశువైద్యశాల

సుండుపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మందులు, టీకాల సరఫరాలో నిర్లక్ష్యం, బిల్లుల చెల్లింపులో జాప్యం, వైద్యులు, సిబ్బంది కొరత నేపథ్యంలో సుండుపల్లె మండలంలో పశువైద్యం నామమాత్రంగా మారిందని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుండుపల్లె మండలంలో సుమారు 50 శాతం మంది పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. మండలంలోని కుడుంవాండ్లపల్లెలో దేవరామిరెడ్డి అనే వ్యక్తి స్థలం ఇవ్వడంతో ప్రధాన రహదారి పక్కన పశువుల ఆసుపత్రి నిర్మించారు. కాలక్రమంలో ప్రధాన రహదారి ఎత్తు పెరగడం, గృహాలు ఏర్పడటం కారణంగా వర్షపు నీరు ఆసుపత్రి భవనం చుట్టూ నిలుస్తోంది. దీంతో ఆసుపత్రి ప్రాంగణంలో కంపచెట్లు పెరిగిపోయాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఈ భవపం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో. పశువులను నిలబెట్టేందుకు కూడా సరైన వసతి లేకుండా పోయింది. ఇక పింఛా పశు వైద్యశాలను పంచాయతీ కార్యాలయ పాత భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ సరైన పరికరాలు లేకపోవడంతో సరైన వైద్యం అందడం లేదని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ బెస్తపల్లిలో పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నేళ్ల క్రితం సిబ్బంది ఆ భవనాన్ని వదిలేశారు. అనంతరం పశువైద్య కేంద్ర భవనానికి స్థలం కేటాయించినా పనులు ప్రారంభం కాలేదు.

వైద్యుల కొరత ఉంది



రాయవరం, పింఛా పశు వైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. ప్రధాన సమస్యలకు వైద్యసేవలు అందించడం కష్టతరంగా మారుతోంది. ప్రస్తుతం మందుల కొరత లేదు. పశువులకు ఏ మైనా సమస్యలు ఏర్పడితే వెంటనే సంప్రదించాలని కోరుతున్నాం.

- విజయ్‌కుమార్, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు

అటెండరు, గోపాలమిత్రలే దిక్కు

పింఛా, రాయవరం పశువైద్యశాలల్లో పశువైద్యులు, సిబ్బంది లేకపోవడం పశుపోషకులకు శాపంగా మారింది. ఈ వైద్యశాలల్లో ఒక డాక్టర్, ఒక వెటర్నరీ అసిస్టెంట్, ఒక అటెండర్ ఉండాలి. అయితే రెండు చోట్ల ఈ మూడు పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. సుండుపల్లె పశువైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ అటెండర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న గంగాధర్‌ను రాయవరా నికి పంపించి, మందులు పంపిణీ చేయిస్తున్నారు. గోపాలమిత్ర సిబ్బంది మాచిరెడ్డిగారిపల్లె, రాయవరం, ముడుంపాడు, పెద్దినేనికాలువ, సొంతంవారిపల్లె గ్రామ పంచాయతీలో సేవలు అందిస్తున్నారు. మండల వ్యాప్తంగా పశు సంవర్ధకశాఖ సహాయకులు (సచివాలయ సిబ్బంది) 9 మంది ఉండగా, వీరెవరీ వైద్యసేవలపై సరైన అవగాహన లేకపోవడంతో తూతూ మంత్రంగా సేవలు అందుతున్నట్లు తెలుస్తోంది. రెండు పశు వైద్యశాలలకు డాక్టర్లను, సిబ్బందిని త్వరితగతిన నియ మించి మెరుగైన సేవలు అందించాలని పశుపోషకులు, ప్రజలు కోరుకుంటున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు : మంత్రి మండిపల్లి

రామాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం రామాపురం మండలం కుమ్మరపల్లెలో బోరు మోటారును ప్రారంభించి గ్రామానికి నీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు మండలాల్లో పర్యటించి నీటి సమస్య ఉన్న గ్రామా లను గుర్తించాలని సూచించామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, కోటిరెడ్డి, సుభాన్, రామాంజనేయరెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, హరినాథరెడ్డి, రామకృష్ణగౌడ్, సహదేవరెడ్డి, సురేంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజుల కాలనీలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రాయచోటి టౌన్: రాయచోటి మండలం చెన్నముక్కపల్లె గ్రామం రాజులకాలనీలో నీటి సమస్యను ఆ గ్రామ ప్రజలు శనివారం మంత్రి దృష్టికి తేవడంతో అప్పటికప్పుడే తన సొంత నిధులతో గ్రామానికి పైపులైన్ వేయించి సమస్య పరిష్కరించారు.



రామాపురం: తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

దీంతో రాజులకాలనీ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాయచోటి నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం



రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కేకే చౌదరి



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు



రాయచోటి: భోజనం వడ్డిస్తున్న లక్ష్మీప్రసాద్ రెడ్డి

రైల్వేకోడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం అని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఛైర్మన్ కేకే చౌదరి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, కళాశాల ప్రిన్సిపాల్ వై. నరసింహమూర్తి,విద్యాశాఖ అధికారి సుందర బాబు, ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, అధ్యాప కుడు చంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: పట్టణంలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీల్లో భాగంగా ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంఈవో సుబ్బరాయుడు, డిప్యూటీ తహసీల్దారు లవకుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, ఉర్దూ స్కూల్ కమిటీ చైర్మన్ అబ్దుల్ వాహిద్ పాల్గొన్నారు.

సంబేపల్లె: సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు ఉపవిద్యాశాఖాధికారి సూర్యప్రకాశ్‌రెడ్డి మధ్యాహ్న భోజనం వడ్డించారు. అనంతరం పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని పది, ఇంటర్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులందరూ కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని ప్రణాళికాబద్ధంగా చదివించాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబేపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నందలూరు: నందలూరు జూనియర్ కళాశాలలో రాజం పేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఎంఈవోలు నాగయ్య, అనంతకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పటిష్ఠంగా అమలు చేసేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

తహసీల్దారు సమక్షంలో ఇరు వర్గాల ఘర్షణ

సుండుపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయభూముల్లోంచి దారి వదిలే విషయంలో టీడీపీ, వైసీపీలకు చెందిన నాయకులు తహసీల్దారు ఎదుటే వాగ్వాదానికి దిగారు, రైతుల భూముల్లోంచి దారి వదలాలంటూ మండలంలోని చెర్లోపల్లెకు చెందిన తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో ఆయన శనివారం పరిశీలన నిమిత్తం గ్రామానికి వచ్చాడు. ఇరువర్గాలను పిలిపించి విచారణ చేస్తుండగా వారు ఘర్షణ పడ్డారు. దీంతో పోలీసులు.సర్దిచెప్పారు. ఇరువర్గాలను బైండోవర్ చేయాలని తహసీల్దార్ ఆదేశించారు.

దాడి కేసు నమోదు

సుండుపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తమ కోళ్లు చనిపోయాయని అడిగినందుకు 2024 డిసెంబరు 30న తనపై, తన భర్తపై దాడిచేశారని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ, బురుజుకాడ రెడ్డివారిపల్లికి చెందిన మహిళ నాగరాణి ఫిర్యాదు చే శనివారం ఫిర్యాదు చేసిందని ఏఎస్సై శ్రీనివాసులు తెలిపారు. దీంతో అదే గ్రామానికి చెందిన రాజారెడ్డితో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

సోమేశ్వరాలయానికి రూ. 2 లక్షల విరాళం

చిట్వేలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలోని కల్యాణ మండపంలో గదుల నిర్మాణానికి విశ్రాంత ఐఆర్ఎస్ డిప్యూటీ కమిషనర్ రామతోటి కనకాద్రి శ్రీమతి నిర్మల, కుమారుడు రాజేంద్రప్రసాద్, కోడలు గీతా, కుటుంబ సభ్యులు 2 లక్షల విరాళాన్ని అందించారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ బొంతల నాగేశ్వర రావు, ఆలయ అర్చకులు పవన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలి చెరువు ఆక్రమణలపై చర్యలకు వినతి

రాజంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణ సమీపంలోని పోలి చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలి శివకుమార్ తహసీల్దారు పీర్‌మున్నీసాకు వినతిపత్రం సమర్పించారు. వేలాది ఎకరాలకు నీరందించే పోలి చెరువును సర్వే చేయించి ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకొని చెరువును సం రక్షిస్తే వందలాది ఎకరాల ఆయకట్టు సాగవుతుందన్నారు. చెరువును ఆక్రమించి వేసిన ముళ్లకంచెను తొలగించాలని తహసీల్దారుకు విజ్ఞప్తి చేశారు.

అలరించిన గ్రామోత్సవం

సుండుపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం రాత్రి వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి గ్రామోత్సవం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ వీధిలోని విరూపాక్షి చెన్నకేశవస్వామి ఆలయం నుంచి చెక్కభజనలు, కోలాటాలు, బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. ప్రతి ఇంటి ముందు భక్తులు టెంకాయలు కొట్టి హారతులు ఇచ్చారు. వందల మంది గోవింద మాలధారులు, ధర్మరాజు, రెడ్డెయ్యరాజు, శ్రీనివాసులరెడ్డి, రెడ్యంపల్లి రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

సిద్దవటం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, మిడ్ లెవల్ హెల్త్ వర్కర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. మండలంలోని మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ శివకుమార్ శనివారం మాట్లాడుతూ పెద్దపల్లె, ఉప్పరపల్లె, బొగిడివారిపల్లె ఆరోగ్య ఉపకేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సేవలందించాలన్నారు. అపరిశుభ్ర ప్రాంతాల్లో అబేట్ పిచికారీ చేయించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని సిబ్బందికి తెలియజేశారు.


అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ

నందలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆరు చుక్కల లిపిని కనుగొని లూయిస్ బ్రెయిలీ అంధుల ఆరాధ్యదైవమయ్యాడని పాటూరు పంచాయతీ నీటి సంఘం అధ్యక్షుడు ఉమామహేశ్వర్ తెలిపారు. అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా శనివారం ఇసుకపల్లె భవిత కేంద్రంలో ఆయన మాట్లాడారు. అనంతరం అంధ విద్యార్థులకు బ్రెయిలీ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమ్మిళిత ఉపాధ్యాయులు రంగస్వామి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

ఓబులవారిపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆశించిన దిగుబడులు రాలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసిన ఓ రైతు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మండలంలోని వైకోట గ్రామ పంచాయతీకి చెందిన కొంకల చంద్రయ్య (25) 4 రోజుల క్రితం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జనవరి 3న చనిపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

మంచు దుప్పట్లో గ్రామాలు



చిట్వేలిని కమ్ముకున్న పొగమంచు



లక్కిరెడ్డిపల్లె మూడురోడ్ల కూడలిలో..

చిట్వేలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలిపై పొగమంచు దట్టంగా కమ్మేసింది. దీంతో శనివారం ఉదయం 10 గంటల వరకు కూడా ఎండ కనిపించ లేదు. 5 రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో చలి ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఉదయం 10 గంటల వరకు పొగమంచు వీడకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

లక్కిరెడ్డిపల్లె: నాలుగు రోజులుగా లక్కిరెడ్డిపల్లె, రాయచోటి ప్రాంతాల్లో మంచు విపరీతంగా కురుస్తోంది తెల్లవారుజామున 4 గంటలనుంచి ఉదయం 10 గంటల వరకు మంచు కప్పుకు పోతోంది ఉదయం వేళల్లో రోడ్లు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

సిద్దవటం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాల నిర్మాణం మార్చి నెలలోపు పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ చెన్నయ్య సూచించారు. మండలంలోని మాధవరం ఎస్కేఆర్ నగర్‌లో శనివారం ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేయాలని,ఆలస్యం చేస్తే బిల్లులు మంజూరు రావన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

'జగనన్న కాలనీలో ఉలవ సాగు'పై చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఉలవ సాగు చేసిన భూమిని పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ రమేశ్‌నాయక్

గాలివీడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలుకుంట పంచాయతీ రెడ్డివారిపల్లె హరిజనవాడకు కేటాయించిన జగనన్న కాలనీలో ఉలవ సాగుపై శని వారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి స్పందించిన కలెక్టర్ హౌసింగ్ అధికారులను వివరణ కోరారు. దీంతో హౌసింగ్ అధికారులు శనివారం పూలుకుంటలోని జగనన్న కాలనీని పరిశీలించారు. అందుకు బాధ్యుడైన అదే గ్రామానికి చెందిన మాజీ వలంటీర్‌ను విచారణ చేశామని హౌసింగ్ ఏఈ రమేశ్‌నాయక్ తెలిపారు. జగనన్న కాలనీలో ఉలవ సాగు చేశావని తాము ప్రశ్నించగా, అతను పొంతన లేని సమాధానం చెప్పాడని తెలిపారు. జగనన్న కాలనీలో ప్లాట్లకు వేసిన రాళ్లను కూడా తొలగించి ఉలవ సాగుచేసిన విషయం నిజమేనని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని తాను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లానని, ఆ స్థలాన్ని రెవెన్యూ వారు స్వాధీనం చేసుకోవాలని తెలియజేశానని వివరించారు.

' సమస్యల పరిష్కారంలో ముందంజ '

నందలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారంలో మజ్దూర్ యూనియన్ ముందుంటుందని గుంతకల్ డివిజన్ అధ్యక్షుడు కామ్రేడ్ టీఎం బాషా తెలిపారు. నందలూరు రైల్వే కేంద్రంలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయానికి శనివారం విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గుంతకల్ డివిజన్‌లో పనిచేసే రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని, మజ్దూర్ యూనియన్ బలోపేతానికి పాటు పడతానని తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నందలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మదన్‌మోహన్, టీడీపీ నాయకులు చుక్కా యానాది తెలిపారు. మండలంలోని టీవీ పురం గ్రామంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు సహకారంతో నిర్వహిస్తున్న జైహనుమాన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీవీపురం టీడీపీ గ్రామ అధ్యక్షుడు శ్రీను, టంగుటూరు సర్పంచ్ మొయిద్దీన్, యువ నాయకులు గంగనపల్లి శ్రీను, హరి తదితరులు పాల్గొన్నారు.

'అన్ని దానాల్లో గొప్పది అన్నదానం'

నందలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని కడప అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి పేర్కొన్నారు. సౌమ్యనాథ సేవా ట్రస్టువారు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఆమె సందర్శించి అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జడ్జిని ట్రస్టు కార్యదర్శి కెశైలేంద్రనాథ్, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుబ్బరామయ్య, చక్రాల సాయినాథ్, పెంచలయ్య కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

రాయచోటి టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యతో మూడేళ్లుగా సతమతమవుతున్న చెన్నముక్కపల్లె వాసుల ను ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో రాయచోటి ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎంపీడీవో వెంకటేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాటా డుతూ మూడేళ్లుగా రాజుల కాలనీలో తాగునీటి సమస్య నెలకొన్నా గ్రామ సర్పంచ్ గానీ, అధికారులు గానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా నెల రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రెండు నెల లు కావస్తున్నా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనకు సిద్ధమవుతా మని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి టీవీ సుదర్శన్, సీపీఐ నాయకులు ఓబులేశ్, జగదీశ్, హరి, గణేశ్, రజాక్, కమాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీకి మైదానం సిద్ధం



ముగ్గులపోటీకి సిద్ధం చేసిన మైదానం

రాజంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్నమయ్య విగ్రహం సమీ పంలోని తాళ్లపాక ముఖ ద్వారం వద్దనున్న శాన్వి ఇం టర్నేషనల్ స్కూల్ ప్రాంగ ణంలో ఆదివారం ఉదయం నిర్వహించనున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 6, వేలు, ద్వితీయ బహుమతిరూ 4 వేలు, తృతీయ బహుమతి రూ. 3 వేలు ఇస్తామన్నారు. మరో 10 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల నగదు అందజేస్తామన్నారు. పాల్గొన్నవారందరికీ భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు ప్రసన్న రంగనాథస్వామి కల్యాణోత్సవం

రాజంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తోట కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ప్రసన్న రంగనాథస్వామితో గోదాదేవి, మహాలక్ష్మీదేవి కల్యాణోత్సవం నిర్వహించడానికి తిరుప్పావై భక్త సేవా సమితి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ధనుర్మాస పూజల్లో భాగంగా ఆదివారం ఉదయం 7 గంటలకు తోట కల్యాణమండపంలో గోపూజ, తులసి పూజ. 8 గంటలకు విష్ణు సహస్ర నామ, తిరుప్పావై పారాయణం నిర్వహిస్తారు. 9.30 గంటలకు ఎదురుకోలు ఉత్సవాన్ని నిర్వహిస్తారు. 9 గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

రాయచోటిటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానం కోసం అనంతపురం జిల్లా గుత్తి పట్టణానికి చెందిన శ్రీహరి, వారి కుటుంబ సభ్యులు శనివారం రూ.1,01,116లు నగదును ఆలయ కార్యనిర్వాహణాధికారి రమణారెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ఉరుసు

సిద్దవటం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచుపల్లె గ్రామంలో హజరత్ సయ్యద్ షావలి ఉరుసు సందర్భంగా శనివారం రాత్రి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువు ప్రజాఉద్దీన్ శనివారం రాత్రి మాట్లాడుతూ గంధం, ఉరుసు మహోత్సవాలకు సహకరించిన జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ, మండల ఉపాధ్యక్షుబు నారపురెడ్డి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ ఉపాధ్యక్షుడుగా పల్లపు రమేశ్

రాయచోటిటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడుగా బీసీ నాయకులు పల్లపు రమేశ్‌ను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన వైసీపీ నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

మామిడి రైతులకు భారీ నష్టం

● ప్రతికూల వాతావరణ మార్పులే కారణమా ?
● కాయల కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
● జిల్లా అంతటా ఇదే పరిస్థితి
● ఆందోళనలో రైతులు


ఈటమాపురం వద్ద ఇంకా పూతకు రాని మామిడి తోట

పెనగలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు ప్రతికూల వాతావరణ మార్పులతో మామిడి రైతులకు భారీ నష్టం సంభవించ వచ్చని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాల సీజన్ ముగిసి తోటలు పూతలతో కళకళలాడాల్సిన సమయంలో కాండానికి మొగ్గ వస్తున్న లక్షణాలు కూడా కనిపించ లేదని వాపోతున్నారు. దీంతో కాయల కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఎన్నో ఆశలతో పంటను సాగు చేస్తారు. పంట దిగుబడి బాగా వస్తే చేసిన అప్పులు తీర్చేద్దామనుకుంటారు. కానీ పంట చేతికొచ్చే వరకు ఏ ముప్పు ఎటునుంచి వస్తుందో తెలియదు. ఇప్పుడు ఇదే పరిస్థితి మామిడి రైతుల్లో కనిపిస్తోంది. ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా మామిడి పంట దెబ్బతింది. తోటలు పూతలతో కళకళలాడాల్సిన సమయంలో కాండానికి మొగ్గలు రాక దిగాలు చెందుతున్నారు. నవంబరు ముగిసిన సమయానికి మొగ్గలు రావడానికి క్రిమిసింహారక మందులను పిచికారి చేయాల్సి ఉంది. అలాగే డిసెంబరు వారంలోనూ, జనవరి 1, 2 వారాల్లో మొగ్గలు విచ్చిన పూతకు పురుగు పట్టకుండా మందు పిచికారి చేయాల్సి ఉంది. ఈ ఏడు భిన్నమైన ప్రతికూల వాతావరణంతో మొగ్గ, పూత దశలో చేయాల్సిన 2 సార్లు పిచికారి పనులు రైతులు నిలిపివేశారు. వాతావరణం అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటే ఇంకో 20 రోజుల తర్వాత మందులు పిచికారీ చేయాలని రైతులు భావిస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు గత మూడేళ్ల నుంచి తోటల్లో కాయలు కాయక మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారని, ఈ ఏడు కూడా అదే పరిస్థితి దాపురిస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. గత మూడేళ్ల నుంచి రైతులు మామిడి తోటలకు సేద్యపు పనులు, ఎరువుల తోలకం, సస్యరక్షణ చర్యలు తదితర సేద్యపు ఖర్చులకు భారీగా పెట్టుబడులు పెట్టుకుంటూ వస్తున్నారు. గత రెండేళ్ల నుంచి నష్టాలను చవిచూస్తున్న రైతులు ఈ ఏడు కూడా అదే పరిస్థితి ఎదురైతే ఎలా అని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా కాయలు కాయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు.


మొగ్గలైనా కనిపించని ఖాదర్ రకం చెట్టు

ఐదేళ్లుగా నష్టాలను చవిచూస్తున్నాం

- రెడ్డెయ్య, రైతు, ఎగువ సిద్దవరం



నాకు 10 ఎకరాల మామిడి తోట ఉంది. ప్రతి ఏడు తోటలకు సస్యరక్షణ చర్యలు, ఎరువుల వాడకం, సేద్యపు పనుల కోసం ఎకరాకు రూ.లక్ష ఖర్చు వస్తోంది. ఐదేళ్లకు మునుపు ఎకరాకు 5 టన్నుల కాయలు దిగుబడి వచ్చేది. గత నాలుగేళ్ల నుంచి దిగుబడి బాగా పడిపోయి ఎకరాకు కనీసం రెండు టన్నుల కాయలు కాయడం రావడం లేదు. ఏ ఏడాది పరిస్థితి చూస్తే భయమేస్తోంది. కనీసం సేద్యపు ఖర్చులు అయినా వస్తాయో రావో అని ఆందోళనగా ఉంది.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

- సురేష్‌బాబు, ఉద్యానశాఖ అధికారి, రాజంపేట డివిజన్



జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో 35,863 హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఫిబ్రవరి నెల నుంచి పొడి వాతావరణం ఏర్పడినప్పుడు పూత, పిందె బాగా ఏర్పడుతుంది. మామిడిలో సస్యరక్షణ చర్యలు గురించి ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించాం. డిసెంబరు నెలాఖరు వరకు హెక్టారుకు రూ.2250తో క్రాప్ ఇన్సూరెన్స్ చేయించాం. ఒకవేళ రైతులకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం రూ.45 వేలు పరిహారం ఇస్తుంది. చాలామంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు.

వ్యాపారులు మొగ్గు చూపడం లేదు

- రవికుమార్, వ్యాపారి, ఈటమాపురం



తోటల్లో మొగ్గలు, పూత పుష్కలంగా కనిపిస్తున్నప్పుడు వ్యాపారులు పిందె, కాయలను అంచనా వేసి ముందుగానే తోటలపై పెట్టుబడి పెట్టేవారు. గత రెండేళ్ల నుంచి ఆ పరిస్థితి లేదు. అంచనాలు తలకిందులు అయితే భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. అందువల్ల వ్యాపారులు ముందస్తుగా కొనుగోలుకు మొగ్గు చూపడం లేదు. మాకు దిక్కుతోచడం లేదు.

నాణ్యమైన భోజనం అందించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్

రాయచోటిటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాల మెరుగునకు, విద్యార్థుల్లో సృజనాత్మకతకు నాణ్యమైన భోజనమే పునాది అని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత విద్యాశాఖలో పెనుమార్పులు వచ్చాయని, అందులో భాగంగానే జూనియర్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు తిరిగి భోజన పథకాన్ని ప్రారంభించారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు బాగా చదువుకోవాలంటే నాణ్యమైన భోజనం ఎంతో అవసరమన్నారు. వారంలో ఆరు రోజుల పాటు ఈ భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీంతో పాటు రాగిజావ కూడా అందించబడు తుందన్నారు. రాయలసీమ, కోస్తా, ఆంధ్ర తదితర ప్రాంతాల పిల్లలు తినే విధంగా అక్కడి పరిస్థితులు బట్టి భోజనాలను తయారు చేస్తున్నారన్నారు. తాను చదువుకునేటప్పుడు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకువచ్చే వాడినని, అటువంటి ఇబ్బందులు ఏమీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాల విద్యార్థుల స్థాయి వరకు అందిస్తోందన్నారు. ఈ పథకాన్ని విద్యా ర్థులు ఉపయోగించుకొని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిం చారు. కాగా జేసీ విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించి అనంతరం కళాశాలలోనే భోజనం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి కృష్ణయ్య, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి రంగోత్సవ్ వేడుకలు

రాయచోటిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఈ నెల 7న ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ (2024-25) సంబరాలు ఉంటాయని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగోత్సవ్ సాంస్కృతిక, సృజనాత్మక పోటీలు విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వారి సాంస్కృతిక భావనను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తామన్నారు. ఈ పోటీలకు సంబంధించి సమాచారం కోసం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వైసీ రెడ్డెప్పరెడ్డి (8008215541), కె.దేవి లెక్చరర్ (9441228359)ను సంప్రదించాలన్నారు. రంగోత్సవ్ (2024-25) సంబరాల్లో ప్రధానంగా 8 విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని, క్విజ్ పోటీలు, చిత్రలేఖనం, హస్తప్రతిలిపి, రంగోలి, డిజిటల్ కలాజ్, స్లోగన్ రచన, రోల్‌ప్లే పోటీలు ఉంటాయన్నారు. ఏపీలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీకి 1 గంట ముందు హాజరుకావాలని, అవసరమైన పరికరాలు, సామగ్రి విద్యార్థులే తెచ్చుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలతో పాటు సర్టిఫికెట్స్ కూడా ఇస్తామన్నారు. ప్రతి డైట్ స్థాయిలో మొదటి, రెండవ, మూడు బహుమతి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులన్నారు. డైట్ స్థాయి పోటీల అనంతరం జిల్లా స్థాయి పోటీలు జనవరి 8న ఉంటాయని, ఆసక్తి గల పూర్వపు కడప జిల్లా (అన్నమయ్య, కడప)లోని విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చని ఆయన తెలియజేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు మృతి

లింగాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నూతలపల్లెలో లోమడ గురుడు (18) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురుడు తండ్రి సూర్యుడు, పోలీసుల కథనం మేరకు... డిసెంబరు 31న రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో గురుడును అదే గ్రామానికి చెందిన కొందరు దూషించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మృతుడు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. ఈ మేరకు కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఒక స్మగ్లరును పట్టుకోవడమే కాకుండా ఒక వాహనం, 11 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ శనివారం తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరగుతోందన్న సమాచారంతో తాము శనివారం ఉదయం చిత్తూరు జిల్లా పులిచెర్ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఏపీ03 ఏఎం 9009 హోండా సీటీ కారును ఆపినా ఆపకుండా మంగళంపేట వైపు వెళ్లిపోయిందన్నారు. దాన్ని వెంబడించగా అందులో ఉన్న వ్యక్తులు కారును వదిలి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. కానీ తమిళనాడు రాష్ట్రం, విల్లాపురానికి చెందిన ఎ.సతీశ్(22) అనే స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కారును పరిశీలించగా అందులో 320 కిలోల బరువున్న ఎర్రచందనం దుంగలు ఉన్నాయని, కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నట్లు వివరించారు.

పకడ్బందీగా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

● పర్యవేక్షించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


ఎంపికలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కడప క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలను ఐదో రోజు శనివారం కడప ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమనరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంటు, ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులకు ఉమ్మడి జిల్లాలో 4492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. ఐదోరోజు శనివారం 600 మంది అభ్యర్థులకు గాను 373 మంది పరీక్షలకు హాజరు కాగా, 229 మంది క్వాలిఫై అయ్యారన్నారు. దేహదారుఢ్య పరీక్షల వద్ద ఎక్కడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్‌ఎఫ్‌ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఐటీ కోర్ టీం, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

● కొడవలి, చాకు, కర్రలతో దాడి ● ఇరువురికి గాయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణలో ఇరువురు గాయపడిన సంఘటన శనివారం రెడ్డివారిపల్లె పంచాయతీలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామంలో భూ విషయంగా గతంలో మరొకరికి సాక్ష్యం చెప్పామనే నెపంతో నిమ్మనపల్లె మండలం, రెడ్డివారిపల్లె పంచాయతీ, దిన్నేపల్లెలో కోర్టు తీర్పు వచ్చిన భూమిలో వ్యతిరేక వర్గీయులు ట్రాక్టర్‌తో దున్నే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడికి వెళ్లి అడ్డుకున్న వారిని కర్రలతో కొట్టి చాకుతో చేతిపై పొడిచారని, ట్రాక్టర్‌తో తొక్కిస్తామని బెదిరించారని ఆరోపించారు. ఈ ఘర్షణలో గాయపడిన వారిని కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రవిబాబు, శ్రీరాములు కుటుంబసభ్యులు నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఈ విషయమై నిమ్మనపల్లె హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తిని వివరణ కోరగా.. బాధితుల ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని, కేసు నమోదు చేయలేదన్నారు.

రామాలయంలో విజిలెన్స్ విచారణ

ఒంటిమిట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండరామాలయంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిపోయిన ఇనుప రేకులు, ఇనుప వస్తువులు, ఇతర సామాన్లు మాయం చేశారన్న ఫిర్యాదుపై టీటీడీ విజిలెన్స్ ఎస్ఐ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కోదండరామాలయంలో శనివారం విచారణ చేపట్టారు. కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు.. సౌమ్యనాథస్వామి ఆలయం, దేవునికడప, తాళ్లపాకలో అనుమతులు లేకుండా పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారని ఇంజనీరింగ్ అధికారులపై విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సౌమ్యనాథస్వామి ఆలయం ధ్వజస్తంభం మార్పిడి చేయకుండానే మార్పినట్లుగా బిల్లులు చెల్లించారని క్షేత్రస్థాయిలో నిర్ధారణకు వచ్చారు. రామాలయంలో ఇనుప వస్తువులను ఇంజనీరింగ్ అధికారులు తరలించారని అప్పటి కాంట్రాక్టర్‌లు అధికారులను వివరించారు. తుది నివేదికను టీటీడీ విజిలెన్స్ అధికారులకు అందజేస్తామని టీటీడీ విజిలెన్స్ అధికారులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక బావిలోకి దూకి మహిళ ఆత్మహత్య


మృతిచెందిన రెడ్డిజ్యోతి

నిమ్మనపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక గ్రామ సమీపంలోని బావిలోకి దూకి మహిళ ఆత్మహత్య చేసుకొన్న సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకొంది. కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లికి చెందిన శివారిపల్లి రెడ్డిజ్యోతి(25)ని వాల్మీకిపురం మండలం పత్తేపురానికి చెందిన తన మేన మామ కిరణ్‌కుమార్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే రెడ్డిజ్యోతి తన పుట్టిళ్లు అయిన కొమ్మిరెడ్డిగారిపల్లికి రెండు రోజుల క్రితం వచ్చింది. కాగా శనివారం ఉదయం కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఆ నొప్పిని భరించలేక సమీపంలో వున్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన గ్రామస్తులు ఆమెను కాపాడేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతురాలికి ఒక కుమారుడు వున్నాడు. మృతురాలి తల్లి రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జిలానీబాషా తెలిపారు.

జాతీయ హైవేపై రెండు కార్లు ఢీ

● ఇరువురికి గాయాలు



చెరువుకట్టపై దెబ్బతిన్న వాహనాలు, (ఇన్‌సెట్లో) గాయాలపాలైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఓబులవారిపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లె చెరువుకట్ట సమీపంలో 2 కార్లు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. హైవే మొత్తం గుంతలమయం కావడంతో గుంతలు తప్పించుకుని వెళ్లే క్రమంలో అదుపు తప్పి ఇరు వాహనాలు ఢీకొన్నాయి. కడప వైపు నుంచి ఏపీ39ఎంకె 7111 క్రెటా కారులో పుష్పమి అను సాఫ్ట్‌వేర్ యువతి కుటుంబం భర్త, పసిబిడ్డతో హైదరాబాదు నుంచి తిరుపతికి వెళుతున్నారు. తిరుమల శ్రీవారి దర్శనం నుంచి నంద్యాలకు ఏపీ 21ఎబి 6666 నంబరు గల ఇన్నోవా కారులో మరో కుటుంబం వెళుతున్నారు. వారి దారిలో వెళ్లాల్సిన వాహనం గుంతలు తప్పించేందుకు మరో దారిలో వెళ్లగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో ఇరువాహనాల ఇంజన్లు దెబ్బతిన్నాయి. ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పి గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహేష్ సిబ్బందితో వచ్చి క్షతగాత్రులను అంబులెన్సులో రాజంపేట ఆసుపత్రికి తరలించారు. అనంతరం రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అవినీతి వెలుగు చూసేనా...!

● బినామీ పేర్లు బయటకు వచ్చేది ఎప్పుడు ? ● సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా జరిగేనా..?


గుర్రంకొండలో ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

గుర్రంకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో సామాజిక తనిఖీ బృందం అవినీతిని వెలికితీయగలరా అన్న చర్చ మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఉపాధిహామీ పథకంలో ఏడాదిపాటు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేయనుంది. ఈ క్రమంలో గుర్రంకొండ మండలంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన వివిధ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు కూలీలు, ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం వారం రోజుల పాటు కూలీలు చేసిన ప్రతి పనిని తనిఖీ చేయనుంది. ఈ తనిఖీ బృందం నిష్పక్షపాతంగా చేస్తే లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము రికవరీ అవుతుందని నాయకులు, కూలీలు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయితీలున్నాయి. ఈ పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో 2023 ఏప్రిల్ 1వ తేది నుంచి 2024 మార్చి 30వ తేది వరకు జరిగిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేయనుంది. ఈ ఏడాది పాటు కూలీలు చేసిన పనులకు రూ.5.22 కోట్లు, మెటీరియల్ పనులకు గానూ రూ.2.50 కోట్లు మొత్తం రూ.7.77 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో చానల్ పనులు, ఫారంపాండ్లు, సచివాలయాల నిర్మాణం, ఆర్బీకేలు, డ్రైన్లు, సీసీరోడ్లు, నాడు-నేడు, చెరువుల పూడికతీత పనులను చేశారు. ఈ పనులను కొందరు వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా చేశారు. ఈ క్రమంలో ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలు అధికంగా జరిగినట్లు టీడీపీ నాయకులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం సామాజిక తనిఖీ బృందం సభ్యులతో కలిసి ఉపాధి సిబ్బందికి కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి ఉపాధిహామీ పనులను తనిఖీ చేయనుంది.

10 మందికి.. మరో ఐదుగురు

ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కూలీలకు ప్రతి రోజు మస్టర్‌ను వేస్తారు. ఈ మస్టర్‌ను పని ప్రదేశంలో కూలీల పేర్లను నమోదు చేసి అటెండెన్స్ వేస్తారు. మస్టర్‌లో కూలీల పేర్లను పూర్తి చేసిన తరువాత ఖాళీ ప్రదేశంలో పనిచేయని కూలీల పేర్లను ఫీల్డ్ అసిస్టెంట్లు వారంలో చివర రోజున బినామీ పేర్లను నమోదు చేస్తారు. ఈ క్రమంలో పని చేయని కూలీల పేర్లను ఐదు నుంచి పది మంది పేర్లను మస్టర్‌లో చేర్చి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకున్నారు. ఇలా మండలంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, వైసీపీ నాయకులు కలిసి ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో మస్టర్లలో బినామీ పేర్లతో సిబ్బంది, నాయకులు లక్షలు గడించారు. సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తే అవినీతి బయటకు వస్తుందని కూలీలు గుసగుసలాడుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమాలను వెలికితీస్తాం

ఉపాధిహామీ పథకంలో వివిధ పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తాం. ప్రతి కూలీతో మాట్లాడి పనులు చేసిన తీరును ఆరాతీస్తాం. అలాగే మస్టర్లలో బినామీ పేర్ల విషయంలో క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలను వెలికి తీసేందుకు సామాజిక తనిఖీ బృందం పనిచేస్తుంది.

-సుబ్బారావు, ఎస్ఆర్పీ, సామాజిక తనిఖీ బృందం సభ్యులు

బావబామ్మర్దుల మధ్య ఘర్షణ

● ఒకరి కత్తిపోటు ● పరిస్థితి విషమం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహబూబ్‌బాషా

కడపక్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రెండో గాంధీబొమ్మ వద్ద బైకు తాళం విషయంపై బావబామ్మర్దులు పరస్పరం ఘర్షణ పడ్డారు. దీంతో బామ్మర్ది ఎదపై బావ పిడిబాకుతో పొడవడంతో చికిత్స నిమిత్తం అతన్ని రిమ్స్‌కు తరలించగా, పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు. వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ నాగార్జున విషయం తెలుసుకుని ఎస్ఐ హుసేన్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ వివరాల మేరకు.. గుర్రాలగడ్డకు చెందిన మహబూబ్‌బాషా తన సోదరిని కడప తిలక్‌నగర్‌కు చెందిన రియాజ్‌బాషాకు ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం చేశాడు. అయితే భార్య, భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడంతో శుక్రవారం గొడవ పడి ఆమె పుట్టింటికి వచ్చింది. కాగా శనివారం బావాబామ్మర్దులు కలిసి మద్యం సేవించి ఆటోలో గుర్రాలగడ్డకు వెళుతుండగా రెండో గాంధీబొమ్మ వద్దకు రాగానే బుల్లెట్ బండి తాళం విషయమై ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో రియాజ్ వద్ద ఉన్న పిడిబాకుతో మహబూబ్ బాషా ఎదపై గట్టిగా పొడవడంతో రక్తస్రావమైంది దీంతో ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి వారు రిమ్స్‌కు తరలించగా రిమ్స్ వైద్యుల సూచనల మేరకు మహబూబ్‌బాషాను కర్నూలుకు రెఫర్ చేశారు. నిందితుడు అక్కడి నుంచి పరారీ అయ్యాడు. అయితే నిందితుడి కోసం సీఐ నాగార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కాగా రియాజ్‌కు నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.



పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

వినియోగం అనర్థం

● వ్యాధుల నివారణకు అధిక మోతాదుల్లో యాంటిబయాటిక్స్

● వ్యాధి నిర్ధారణ తర్వాతే వాడాలంటున్న నిపుణులు

ప్రొద్దుటూరు రూరల్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే వ్యాధులకు తొందరగా నయం చేయాలన్న ఆతృతతో పోషకులు యాంటీబయాటిక్స్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఫలితంగా వ్యాధులు తగ్గకపోగా బ్యాక్టీరియా వైరస్ బలపడి యాంటీబయాటిక్స్‌కు కూడా లొంగని పరిస్థితి ఏర్పడుతోంది. పశువులకు వ్యాధులు వచ్చినప్పుడు యాంటిబయాటిక్స్ సెన్సిటివ్ టెస్ట్ (ఏబీఎస్సీ) చేయించాకే మందులు వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో మున్ముందు రోగాలు మరింత ప్రమాదకరంగా మారుతాయని హెచ్చరిస్తున్నారు. వ్యాధులు న్న పశువుల పాలు, మాంసం ద్వారా మనిషులకు చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

● జిల్లావ్యాప్తంగా పశువుల్లో వచ్చే చిన్న చిన్న వ్యాధులకు సైతం అధిక మోతాదుల్లో యాంటిబయాటిక్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. సూక్ష్మమైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు మానవులు, పశువుల శరీరం లోపల, బయటా ఉంటాయి. వీటిని మైక్రోస్ అని పిలుస్తారు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటానికి, రోగ నిరోధక శక్తి సక్రమంగా ఉండేందుకు మేలు చేసే బ్యాక్టీరియా, వైరస్‌లు తోడ్పడతాయి. పశువుల శరీరానికి హానిచేసే బ్యాక్టీరియాల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడానికి పోషకులు యాంటిబయాటిక్స్‌పై ఆధారపడుతున్నారు. నిర్దేశిత మోతాదు, నిర్ణీత కాలం కాక ఇష్టానుసారం అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

● సీజనల్ వ్యాధులు

శీతాకాలంలో పశువులు, జీవాల్లో గొంతువాపు, గాలికుంటు, లింపిస్కిన్ సహా పాడిపశువులకు పొదుగువాపు వ్యాధి, జీర్ణసంబంధ, గర్భకోశవ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. వీటికి టీకాలు, యాంటీబయాటిక్స్ ద్వారా వైద్యం చేస్తారు. పశువుల వ్యాధులపట్ల పోషకులు మందులను ఇష్టానుసారం వాడకూడదని వైద్యుల సూచనలపై వాడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● పరీక్షల తర్వాత వాడితే మేలు

పశువుల్లో వ్యాధి వస్తే నమూనాలు సేకరించి యాంటిబయాటిక్స్ సెన్సిటివ్ టెస్ట్ (ఏబీఎస్సీ) చేయించాలి. రోగ నిర్ధారణకు రక్తం, పాలు, చీము, చీమిడి, ముక్కునుంచి కారే రసాలను నమూనాలుగా సేకరించి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో 14 రకాల యాంటిబయాటిక్స్‌ల్లో ఏ మందులు వాడాలో పరీక్ష ఫలితం సూచిస్తుంది. ఫలితాల ఆధారంగా మందులు వాడాలి. దీంతో పోషకులకు ఖర్చు తగ్గుతుంది. పశువులు త్వరగా కోలుకుంటాయి. పరీక్షల ద్వారా నిర్ధారణ చేయకుండా ఒకటి పనిచేయకపోతే మరొకటి అన్నట్లుగా వాడితే ఇబ్బందులు, ఎదురవుతాయని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు వైద్యుల సూచనల మేరకు నిర్ణీత కాలం సగటున 3 నుంచి 5 రోజులు మందులు వాడకంతో ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో ఏబీఎస్సీ తప్పనిసరని వైద్యులు సూచిస్తున్నారు.

● పశువుల నుంచి మనుషులకు వ్యాప్తి



మితిమీరి యాంటిబయాటిక్స్ వాడకంతో అటు పశువులకేకాక వాటి ద్వారా మనుషులకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ఎక్కువ మోతాదులో యాంటిబయాటిక్స్ వాడకంతో గొర్రెలు, మేకలు వ్యాధి నిరోధకశక్తిని కోల్పోతాయి. వాటి మాంసం తినేందుకు పనికిరాదు. ఆ పాలను తాగిన దూడల్లో కూడా రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతుంది. పాలను తాగితే చిన్నపిల్లలు, పెద్దల్లో డయేరియా, వాంతులు, విరేచనాలు, జీర్ణసంబంధిత వ్యాధులు, హార్మోన్లపై ప్రభావం తదితర దుష్ఫలితాలు ఉంటాయి.

డాక్టర్ ధనుంజయరెడ్డి, సహాయ సంచాలకుడు



పరీక్ష కిట్లు

● పరీక్షలు ఉచితమే

పశువైద్యులు నమూనాలను సేకరించి నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న పశుసంవర్ధక ప్రయోగశాలలకు పంపితే పరీక్షలు చేసి పశువులకు ఏ జబ్బులు వచ్చాయో నిర్ధారిస్తారు. ఏ యాంటి బయాటిక్ పనిచేస్తుందో 24 గంటల నుంచి 48 గంటల వ్యవధిలో నివేదిక ఇస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ఉచితమే.

శస్త్రచికిత్సలో వైద్యురాలి నిర్లక్ష్యం

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌తో పేగుకు ఇన్‌ఫెక్షన్

హైదరాబాదులో చికిత్సకు రూ.10లక్షలు వ్యయం

వైద్యురాలిపై విచారణ చేపట్టిన అధికారులు



విచారణ అధికారులతో మాట్లాడుతున్న బాధితురాలు

ప్రొద్దుటూరు , జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యురాలి నిర్లక్ష్యంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మహిళ పేగు ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. బాధితురాలు హైదరాబాద్‌లో రూ. 10 లక్షలు ఖర్చు చేసిన సంఘటన వెలుగు చూసింది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియారాణీపై బాధితురాలు కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదుపై కడప రిమ్స్ నుంచి వైద్య అధికారులు వచ్చి బాధితురాలు, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఇలియారాణిని శనివారం విచారించారు. వివరాల్లోకెళితే...

చాపాడు మండలం నక్కల దిన్నె వాసి శివలక్ష్మీ 2024 అక్టోబరు 29న ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. అదే రోజు డిశ్చార్జి చేసి పంపారు. ఇంటికి వెళ్లాక వరుసగా వాంతులవుతున్నాయని ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియారాణికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఆ మరుసటి రోజు మళ్లీ ఆస్పత్రికి రాగా ఎక్స్‌రే తీసి గ్యాస్ ట్రబుల్ సమస్య వుందని మందులిచ్చి పంపారు. కానీ కడుపు నొప్పి పెరుగుతోందని నవంబరు 2న మళ్లీ డాక్టర్‌ను సంప్రదిస్తే స్కానింగ్ చేసి సమస్య ఏమీ లేదని తెలిపారు. డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని గుర్తించి ప్రైవేటుగా స్కానింగ్ చేయించుకోగా ఆపరేషన్‌తో పేగు దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు వెళ్లి మరో సర్జరీ చేయించుకున్నారు. దాదాపు వారికి రూ.10 లక్షలు ఖర్చు అయినట్లు తెలిపారు. రెండో విడత సర్జరీ కూడా చేయాల్సివుందని హైదరాబాద్ వైద్యులు తెలిపినట్లు వెల్లడించారు. పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు బాధితురాలు శివలక్ష్మీ, ఆమె భర్త విశ్వనాధరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో రిమ్స్ కళాశాలకు చెందిన డాక్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో ఒక రేడియాలజిస్టు, సర్జన్, గైనకాలజిస్టు విచారణ బృందం బాధితురాలు శివ లక్ష్మీని విచారించారు. డాక్టర్ ఇలియా రాణిని కూడా ప్రత్యేకంగా ఆమె చాంబర్‌లో విచారించారు. ఇదిలావుండగా పీపీ యూనిట్ విచారణకు వచ్చిన బాధితురాలు శివలక్ష్మీ తన భర్త విశ్వనాధ్‌రెడ్డితో కలిసి డాక్టర్ ఇలియారాణి చాంబర్‌కు వెళ్లి తమకు జరిగిన అన్యాయంపై నిలదీశారు. వాగ్వాదం చేసుకోవడంతో డాక్టర్ ఇలియా రాణి అక్కడి నుంచి వెళ్లి పోయింది.

కబడ్డీ సెలక్షన్ నేషనల్ సభ్యుడిగా జనార్ధన్



కడప స్పోర్ట్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరగనున్న 50వ ఆంధ్ర రాష్ట్ర కబడ్డీ జూనియర్స్ బాల, బాలికల నేషనల్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జనార్ధన్ ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ పద్మజాబాల నియమించినట్లు వెల్లడించారు. జనార్ధన్ నియామకం పట్ల జిల్లా అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు శిల్పారామానికి టీవీ యాంకర్లు

కడప కల్చరల్ జనవరి 4, (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై ప్రత్యేకంగా ఆకర్షణగా టీవీయాంకర్లు శ్రీయుక్తా, అమూల్య రానున్నట్లు పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. శిల్పారామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం జరగనున్న కార్యక్రమాలకు కడప నృత్య కళాకారిణి విజయశాంతి బృందం కళాకారులు శాస్త్రీయ, జానపద, కూచిపూడి, సినీ గీతాలకు అభినయించనున్నారన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ జరగనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమాలను దిగ్విజయం చేసేందుకు ప్రజలు హాజరవాలని కోరారు.

అధికారుల సమక్షంలో పోస్ట్‌మార్టం

మైదుకూరు రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అధికారుల సమక్షంలో శెట్టివారి పల్లె వాసి అల్లాడుపల్లె వీరారెడ్డి (75) మృతదేహాన్ని గుంత నుంచి వెలికి పోస్ట్‌మార్టం చేశారు. డిసెంబరు 6న తండ్రి మృతి చెందడంపై వీరారెడ్డి కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దినేష్, తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎస్ఐ చిరంజీవి తదితర అధికారుల పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి : ఈడీ

కడప ఎన్జీఆర్ సర్కిల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య కోరారు. సీడాప్ ద్వారా మైనార్టీ యువతకు నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు తమ వివరాలను ఎస్ఈఈడీఏపీ.ఏపీ..ఈటీవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్, కెరీర్ కౌన్సెలింగ్‌లో ఉచిత శిక్షణ ఉం టుందన్నారు. దరఖాస్తు, నకలు జతచేసి మూడు కాపీలను కార్యనిర్వాహక సంచాలకులు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, 'డి' బ్లాక్ న్యూ కలెక్టరేట్, కడప-516004 చిరునామాకు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 08562-2411375ను సంప్రదించాలన్నారు.

ప్రాజెక్టులను విస్మరిస్తే పోరు తప్పదు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్



సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీమ సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం విస్మరిస్తే పోరుబాట తప్పదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ హెచ్చరించారు. శనివారం సీపీఎం జిల్లా 12వ మహాసభల సందర్భంగా జీయోన్ కళాశాల నుంచి ఐటీఐ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజించు పాలించు పద్ధతిలో ప్రజల మధ్య మత వైషమ్యాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందన్నారు. రాష్ట్రంలోని ప్రకృతి వనరులన్నీ అదానీకి తాకట్టు పెట్టడానికి ప్రయత్నిస్తోందన్నారు. పోర్టులు అదానీ పరమయ్యాయి, వేలాది ఎకరాలు అదానీకి కట్టబెడుతున్నారన్నారు. కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. విభజన చట్టం హామీలు దశాబ్దాల తరబడి వెనుకబడిన ప్రాంతాల్లో ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. ఏపీలోని కూటమి సర్కార్ మౌనంగా ఉండడం సరైంది కాదన్నారు. కార్పొరేట్ల కోసమే జమిలీ ఎన్నికలను తెచ్చేందుకు మోదీ చూస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పిలుపునిచ్చారని, అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక వాటినే ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు ఊసే లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురవుతోందని, జిల్లాలో రైతాంగం ఆత్మహత్యల పరంపరం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, బి.మనోహర్, శివకుమార్, ఐఎం సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, శివకుమార్, తదితర సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి

పులివెందుల టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ సమీప వంకలో దిగి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... కదిరి నియోజకవర్గం పట్నం వాసి ముస్తఫా రెండేళ్ల నుంచి సుబ్రమణ్యం వద్ద పశువులు మేపుతూ ఉండేవాడు. రోజు మాదిరిగానే పశువులు మేపేందుకు ముస్తఫా పశువులను తీసుకుని రోటరీపురం సమీపంలోకి వెళ్లాడు. పశువులు వంకలోకి దిగాయని ముస్తఫా కూడా దిగడంతో ఆయన మునిగిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ విష్ణు ఆధ్వర్యంలో ప్రమాద కారణాలను స్థానికులను అడిగి కేసు నమోదు చేసుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ



బాధితుడిని విచారిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

కలకడ, జనవరి 4(ఆంధ్రజ్యోతి):కలకడ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 19న నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా డీఎస్పీ శనివారం ఎనుగొండపాలెం పంచాయతీ బండ మీద ఎస్సీకాలనీకి చెందిన బాధితుడు రెడ్డెప్పను పరామర్శించారు. అనంతరం దాడి జరిగిన ప్రదేశానికి వెళ్లి సాక్షులను విచారించారు. అదే విధంగా పోలీసులు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామాంజనేయులు, పాలకుంట శ్రీనివాసులు పాల్గొన్నారు.

18న నవోదయ ప్రవేశ పరీక్షలు

మదనపల్లె అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని వలసపల్లె గ్రామంలో ఉన్న జవహర్ నవోదయ స్కూల్‌లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేలాయుధన్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. నవోదయ గవర్నమెంట్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్, అడ్మిట్ కార్డు డౌన్‌లోడు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాల కోసం హెల్ప్ డెస్క్ 8919956395కు ఫోన్ చేయాలని లేనిపక్షంలో నేరుగా పాఠశాలల్లో సంప్రదించాలని అన్నారు.

ఉచిత టైలరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐలో మూడు నెలల ఉచిత టైలరింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీఓ నాగరాజు, ఏపీ ఎస్ ఎస్డీసీ కో ఆర్డినేటర్ చౌడయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా ఐటిఐలోని స్కిల్ హబ్ సెంటర్‌లో టైలరింగ్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నా రు. 15 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న మహిళలు అర్హులన్నారు. అసక్తి గల అర్హులైన వారు ఈ నెల 8వ తేదీ లోపు తంబళ్లపల్లె ఐటిఐలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9618655759 సంప్రదించాలన్నారు.

ఎంఆర్‌సీకి వాటర్ ప్యూరిఫయర్ వితరణ



నిమ్మనపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్థానిక ఎంఆర్‌సీకి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉచితంగా వాటర్ ప్యూరిఫయర్ శనివారం ఎంఈవో-1 పద్మావతికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వెంగంవారిపల్లి పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయురాలు ప్రమీల, బండ్లపై పాఠ శాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు శోబారాణి లు ఎంఆర్‌సీలో చదివే పిల్లలతో పాటు భవనంలో జరిగే సమావేశాలకు మంచి నీరు అందిం చేందుకు ఉద్దేశంతో ఉచితంగా వాటర్‌ప్యూరిఫయర్‌ను వితరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న రమాదేవి ఆసుపత్రి వైద్యులు

పీలేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత కంచి సూరి ఆధ్వర్యంలో పీలేరు ఇందిరమ్మ కాలనీలో శనివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందిరమ్మ కాలనీతో పాటు ఎర్రగుంట్లపల్లె, అగ్రహారం, కాకులారంపల్లె పంచాయతీల్లోని సుమారు 400 మంది ప్రజలు వైద్య శిబిరంలో ఆరోగ్య సేవలు పొందారు. తిరుపతిలోని రమాదేవి ఆసుపత్రి వైద్యులు రోగులకు ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పీలేరుకు చెందిన టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున శిబిరంలో పాల్గొని తమ సేవలు అందించారు.

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం

వాల్మీకిపురం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోనేటివీధిలో అయ్యప్పస్వామి నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, విశేషాలంకరణలు చేశారు. అనంతరం అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకిలో అయ్యప్ప భక్తుల కోలాహలం నడుమ పట్టణ పురవీధుల్లో నగరోత్సవం వైభవంగా సాగింది. సాయంత్రం ఆలయంలో అంబలం, పడిపూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. గురుస్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

జీవాల పోషణపై రైతుల ఆసక్తి



పెద్దమండ్యం, జనవరి 4(ఆంధ్రజ్యోతి) వ్యవసాయంలో ప్రతి ఏడాది నష్టాలు చవ్విచూస్తుండడంతో కొందరు రైతులు జీవాల(గొర్రెలు, పొట్టేళ్ళు, మేకలు)పోషణవైపు మొగ్గుచూపుతున్నారు. వ్యవసాయంలో అతివృష్టి, అనావృష్టిలతో పంటలు దిగుబడులు రాక కనీసం పెట్టిన పెటుబడి ఖర్చులు కూడా రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో చాలా రైతు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇలాంటి పరిస్థితులలో ప్రత్యామ్నాయ ఆదాయంగా పలు రైతు కుటుంబాలు గొర్రెలు, పొట్టేళ్ళు, మేకలు పోషణకు ముందుకువస్తున్నారు. పెద్దమండ్యం మండలలో సుమారు వెయ్యి కుటుంబాలు జీవాల పెంపకం చేపట్టినట్లు అధికారిక అంచన. అడవి ప్రాంతం, బీడు, చెరువు ప్రాంతాలల్లో జీవాలకు మేత దొరుకుతుంది. మండలంలోని సి. గొల్లపల్లి గ్రామ పంచాయతీ రెక్కలకొండపల్లి రైతు కుటుంబాలు జీవాలు పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గ్రామానికి దూరంగా గొర్రెల మందలు ఏర్పాటు చేసుకొని కాపాల కాస్తున్నారు. 15 కుంటుంబాలు మందల వద్ద గుడారాలు వేసుకొని జీవనం సాగి స్తున్నారు. పొట్టేళ్ల పోషణ రైతులకు అధిక రాబడి ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

వెయ్యి కుటుంబాలకు జీవనాధారం

పెద్దమండ్యం మండలంలో సుమారు వెయ్యి కుటుంబాల వారు జీవాల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రెవెన్యూ విలేజ్‌కు జీవాల పెంపకందార్ల సంఘాలు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే జీవాలకు సోకే వ్యాధుల నివారణకు, సీజనల్ వ్యాధులకు ప్రత్యేక టీకాలు, మందులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. జీవాల్లో నట్టల నివారణకు సంవత్సరంలో రెండు సార్లు ఉచితంగా మందులు అందిస్తున్నాం. జీవాల పెంపకందార్లు ఈ సదుపాయాలను వినియోగించుకోండి.

-ఉస్మాన్, పశువైద్యాధికారి, పెద్దమండ్యం

జీవాల పోషణ మేలుగా ఉంటోంది



జీవాలు పోషణ లాభదాయకంగానే ఉంటోంది. వ్యవసాయం గిట్టుబాటు కాలే దు. పంట సాగుకు పెట్టుబడి రావడంలేదు. ప్రతి ఏడాది పంటలతో ఆర్థికంగా నష్టపోతున్నాం. గొర్రెలు పెంపకం అవసరాలు తీరుతున్నాయి. 10 ఎకరాల భూమి ఉంది. బోర్లు ఉన్నాయి. సేధ్యంలో గిట్టుబాటు కాకపోవడంతో జీవాలు పెంపకం చేస్తున్నాం. 80 జీవాలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులు తీరుతున్నాయి.

-ఈశ్వర్‌రెడ్డి, బంగ్రేవు కొత్తపల్లి, పెద్దమండ్యం మండలం

వ్యవసాయంతో ప్రతి ఏడాది నష్టమే..



వ్యవసాయం వల్ల ప్రతి ఏడాది నష్ట పోతున్నాం. వ్యవసాయ కూలీలు తక్కువైపోతున్నారు. ఎద్దులతో సేద్యం లేదు. ట్రాక్టర్లతో సేద్యం ఖరీదు అయిపోయింది. గొర్రెలు పెంపకంతో ఆదాయం వస్తోంది. మాకు 15 ఎకరాల భూమి ఉంది. కొంత వరిమడి వేసుకుంటాం. మిగతాది బీడుగా వదిలేశాం. 20 ఏళ్లగా గొర్రెల పెంపకం చేస్తున్నాం. ప్రస్తుతం 70 జీవాలు ఉన్నాయి.

కృష్ణమనాయుడు, రెక్కలకొండపల్లి, పెద్దమండ్యం మండలం

బి.కొత్తకోటలో మాజీ సీఎం కిరణ్ విస్తృత పర్యటన



ఉదయ్‌కుమార్ కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ సీఎం కిరణ్

బి.కొత్తకోట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమా ర్‌రెడ్డి శనివారం బి.కొత్తకోట మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ కుడుంశ్రీనివాసులు సోదరుడు టీడీపీ నాయకుడు కుడుం ఉదయ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్నా మాజీ సీఎం కిరణ్ పట్టణంలోని ఉదయ్‌కుమార్ నివాసానికి చేరుకొని ఆయన భార్య, పిల్లలతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మృతికి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. తన హయాంలో 700కోట్లతో కండలేరు జలాలు తీసుకొచ్చి ఉమ్మడి చిత్తూరు జిల్లా అంతటికీ శాశ్వితంగా నీటివసతి కల్పిం చాలని భావించి 2వేల కోట్లు నిధులు కేటాయించడంతో పాటు, కార్యచరణ కూడా మొదలు పెట్టామన్నారు. అయితే ప్రభుత్వం మారగానే దానిని పక్కన పెట్టారన్నారు. చిత్తూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలకు రోడ్ల నిర్మాణం కోసం ప్రతి యేటా రూ.20 కోట్ల చొప్పున రూ.280 కోట్లు మూడేళ్లపాటు ఇచ్చామని గుర్తు చేశారు. అంతకు మునుపు మండల పరిధిలోని గట్టు గ్రామంలో బీజేపి మండల కన్వీనర్ డేరింగుల రామదాసు, సిద్దారెడ్డిలతో కలిసి గట్టుకు చెందిన సీనియర్ నేత, టీటీడీ మాజీసభ్యుడు ఆలూరి సుబ్రమణ్యం నివాసానికి వెళ్లి పలకరించారు. టీడీపీ, బీజేపీ నాయకులు నారాయణస్వామిరెడ్డి, బంగారు వెంకట్రమణ, కనకంటి ప్రసాద్, శరత్, రంజిత్, ప్రకాష్‌సురేంద్ర, చాకనారాజా, సుకుమార్, గోపాల్‌రెడ్డి, కావడి రవీంద్ర, చింతల శంకరమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులను వేగవంతం చేయండి



రంగసముద్రం లేఔట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి

పెద్దతిప్పసముద్రం జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని డీఈ వెంకటరెడ్డి సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహాలు నిధుల లేమితో నిలిచి పోయిన విషయం తెలిసిందే. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నిలిచి పోయిన గృహాలకు సైతం బిల్లులు మంజూరు చేస్తు న్నదని తిరిగి లబ్ధిదారులు పనులు ప్రారంభిస్తే బిల్లులు వేగవంతంగా మం జూరు చేస్తామని డీఈ పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో గృహ నిర్మాణ పను లు వివిధ దశల్లో నిలిచి పోయాయని వాటిని తిరిగి లబ్ధిదారులకు ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు గ్రూపుల్లో పని చేస్తున్న సంఘమిత్రాలు సమన్వయం చేసుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డీఈ సూచించారు. మండలంలోని రంగసముద్రం, తుమ్మరకుంట పంచాయతీ నవాబుకోట గ్రామాల్లో ఆయన పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నాగార్జున, శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర పాల్గొన్నారు.

వాసవీ, వనిత క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మదనపల్లె అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి):మదనపల్లె వాసవీ, వనిత క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమానికి వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ నాగసుప్రజా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వాసవీక్లబ్ మదనపల్లె నూతన అధ్యక్షుడుగా పొనగంటి అమరనాథ్, కార్యదర్శిగా పబతి మునిరాజా, కోశాధికారిగా కూరపాటి కిషోర్‌బాబు, వనితక్లబ్ అధ్యక్షురాలిగా ముంటిమడుగు శ్వేత, కార్యదర్శిగా భానురేఖా, కోశాధికారిగా బెంగళూరు సంధ్యలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాగసుప్రజా మాట్లాడుతూ వాసవీ, వనిత క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అనంతరం మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్ మాట్లాడుతూ వాసవీక్లబ్ కార్యక్రమాలకు మదనపల్లె ఆర్యవైశ్య సంఘం పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వ జిల్లా గవర్నర్ తేజ యశస్విగుప్తా, రాచపల్లె బాలాజీ, కృష్ణమూర్తి, సురేష్‌బాబు, నాగలక్ష్మీ, వెంకటేష్ బాబు, సురేష్‌బాబు, వాసవీ, వనితక్లబ్ సభ్యులు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవికుమార్

పెద్దతిప్పసముద్రం జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నూతన ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పీటీఎం ఎస్‌ఐ రవికుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఆయన ప్రధాన రోడ్లలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ఖచ్చితంగా వినియోగిం చాలని, లైసెన్స్ తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహ నాలను నడపరాదని నిబంధనలను అతిక్రమిస్తే లైసెన్స్‌ను రద్దు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

రామసముద్రం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం మాలేనత్తం గ్రామ పంచాయతీ కొండూరు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న లావణ్య(32) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అంగన్వాడీ సూపర్‌వైజర్ వేధింపులు తాళలేక ఆత్మ హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి చిన్న విషయంపై తనను సూపర్‌వైజర్ వేధిస్తోందని, పలు మార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా బాధితురాలు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

సూపర్‌వైజర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి



సబ్‌కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

మదనపల్లె టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి):రామసముద్రం మండలం కొండూరు అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి కారణమైన సూపర్‌వైజర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ నాయకుడు పి.శ్రీనివాసులు, అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త లావణ్యను సూపర్‌వైజర్ అకారణంగా మానసిక వేదనకు గురిచేశారని ఈ క్షోభ భరించలేక ఆత్మహత్యకు యత్నించిందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారించి సూపర్‌వైజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీఏవోకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు రాజేశ్వరి, మధురవాణి, గంగాదేవి, రాధిక, విజయ, మధుమతి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి ఆర్థిక సాయం

మదనపల్లె, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-నిమ్మనపల్లె మార్గంలోని హిందూశ్మశాన వాటిక అభివృద్ధికి బసినికొండ గ్రామకమిటీ అధ్యక్షుడు పి.నటశేఖర్ శని వారం రూ.25వేలు విరాళం అందజేశారు. మాజీ సైనికుల సంక్షేమసంఘం అధ్యక్షు డు కంచెర్ల శ్రీనివాసులు నాయుడు పోరా టంతో పదేళ్ల క్రితం బసినికొండ రెవెన్యూ గ్రామంలో 6.30 ఎకరాలు రెవెన్యూ అధికా రులు స్థలం కేటాయించారు. దీని నిర్వహణ లేకపోవడంతో అప్పటి నుంచీ శ్మశాన వాటిక ముళ్లకంపులతో నిండిపోయింది. ఇందులోభాగంగా తనవంతు భాగంగా పులగంటి నటశేఖర్ రూ.25వేలు నగదును విలాస నిలయం, హిందూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు బీవీరమణకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జేవెంకటేష్, జి.నవీన్‌చౌదరి, మండల ప్రధాన కార్యదర్శి కత్తి లక్ష్మన్న, పి.నాగేంద్ర, విజయ్‌కుమార్, యశ్వంత్ పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణం రాంగారెడ్డి కాలనీలో చోటుచేసుకుంది. మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు స్థానిక రంగారెడ్డికాలనీకి చెందిన మదన్‌మోహన్ కుమారుడు సోముశేఖర్ (26) బార్‌బర్ షాపులో పనిచేసుకొంటూ, మధ్యలో మంగళవాయిద్యం చేయడానికి వెళ్లేవాడన్నారు. గతంలో కొద్దిరోజుల క్రితం మంగళవాయిద్యం పనికి వెళ్లి వస్తుండగా ప్రమాదంలో బర్రే ఎముకలు దెబ్బతిని ఇంట్లోనే ఉంటున్నాడన్నాడు. శనివారం ఎముకల నొప్పి తట్టుకోలేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొన్నట్లు తెలిపారు. ఈ మేరకు తాలుకా పోలీసు స్టేషన్‌లో సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రీసర్వే పేరుతో పేదల భూములు కబ్జా

మదనపల్లె టౌన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) భూముల రీసర్వేతో వైసీపీ నాయకులే భూములు కబ్జా చేశారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం మండలంలోని పొన్నేటిపాళెం పంచాయతీలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ మదనపల్లె చుట్టుపక్కల డీకేటీ భూములను వైసీపీ నాయకులు రైతులను బెదిరించి తక్కువ ధరలకు లాక్కొన్నారని, ఫ్రీహోల్డ్ పేరుతో భూ కుంభకోణాలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ అక్రమాల లెక్కలు తేలుస్తామన్నారు. ప్రస్తుతం మదనపల్లె మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర, డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, టీడీపీ నాయకులు గురునాథ్‌యాదవ్, జీవీ నాయుడు, మధుసూధన్‌రెడ్డి, ఈశ్వర్‌నాయుడు, భారతి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలివెళ్లిన జనం



ములకలచెరువు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరుగుతున్న హిందూ సమ్మేళనానికి హాజరయ్యేందుకు ములకలచెరువులో నుంచి శనివారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో భారీగా జనం తర లివెళ్లారు. ఇందు కోసం హైం దవ శంఖారావం ర్యాలీ నిర్వహించారు. హిందూ సమ్మేళనానికి భారీగా తరలిరావాలంటూ ర్యాలీగా స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బస్టాండు సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం ములకలచెరువు నుంచి విజయవాడకు వెళ్లేం దుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో బయలుదేరారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి, మెడికల్‌స్టోర్ రమణ, గణేష్, శంకర్‌రెడ్డి, రెడ్డెప్ప, సకల ప్రభాకర్, కేశవ, మంత్రి ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ఇంటర్ మీడియట్ చదువుతున్న విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనపథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే ప్రారంభించి స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థుతోపాటు కళాశాలలోనే భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాఠశాల విద్యార్థులకు అందిస్తున్ననాణ్యమైన భోజనం ఇంటర్మీడియల్ విద్యార్థులకు అందించాలనే ఉద్దేశ్యంతో నేడు ఈ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎలువంటి సమస్య ఉన్న పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం, ఎంఈవోలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి, మహమ్మద్‌ఖాన్, టీడీపీ నాయకులు షంషీర్, సంఘం హరి, గురుమంచూరు. శ్రీరామ్ వినోద్, బాబా, మహేష్, పెంచుపాడు స్వామి, సురేంద్రరెడ్డి, గాంధీ, లాల్ బాషా, జాన్‌బాబు, పూలకుంట్ల హరిబాబు, చిప్పిలి చెంద్రాయులు, పోర్డు డైరెక్టర్ లలితమ్మ, పోతబోలు రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.



పీలేరులో భోజనం వడ్డిస్తున్న దృశ్యం

పీలేరులో: పీలేరులోని ప్రభుత్వ జూని యర్ కళాశాలలో శనివారం డొక్కా సీత మ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారం భమైంది. కళాశాలలో జరిగిన కార్యక్రమం లో పీలేరు ఎంఈవో లోకేశ్వర రెడ్డి, జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి విద్యార్థులకు భోజనం వడ్డించి పథకాన్ని ప్రారంభించారు. అంతకు ముందు కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిద్ద రూ మాట్లాడుతూ ఇంటర్‌లో చాలా మంది పేద విద్యార్థులున్నారని తెలుసుకున్న రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్, వారందరికీ నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. అనంతరం మత్తుపదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు

తంబళ్లపల్లెలో: కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ఓ వరం లాంటిదని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మండల విద్యాశాఖాధికారులు త్యాగరాజు, నాగసుబ్బ రాయుడు, ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ వెంకట్రాము డుతో కలిసి ప్రారంభించారు. విద్యార్థుల చేత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటా మని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, అధ్యాపకులు రమణ, కూటమి నాయకులు రషీద్ బాష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అన్ని మండలాల్లోని జూనియర్ కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవోలు, కళాశాలల ప్రిన్సిపాళ్ల ప్రారంభించి విద్యార్థులకు భోజనం అందించారు.

అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ

తంబళ్లపల్లె జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ అని మండల విద్యాశాఖాధికారులు త్యాగరాజు, నాగసుబ్బరాయుడులు పేర్కొన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని పురష్కరించుకుని తంబళ్లపల్లె మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో లూయిస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజలు చేసి నివాళులర్పించారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ తాను కనిపెట్టిన లిపితో అంధులకు విద్యాదానం చేసిన మహనీయుడన్నారు. అందరితో సమానంగా అంధ పిల్లలు సైతం విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్న గొప్ప సంకల్పంతో ఎటువంటి సౌకర్యాలు లేని నాటి రోజుల్లోనే నేటి కంప్యూటర్ భాషకు వీలుగా లిపిని రూపొందించిన మేధావి లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు కవితాబాయి, వెంకట్ కుమార్, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు రేఖ, శ్రావణి, సీఆర్పీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతమ్ముళ్ల మధ్య ఫ్లెక్సీల వివాదం



జ్యోతిసర్కిల్‌లో వాదులాడుకుంటున్న తెలుగుతమ్ముళ్లు

బి.కొత్తకోట, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండిపల్లి రాక సందర్భంగా ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో టీడీపీలోని ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. తీవ్ర వాదులాట చోటు చేసుకుంది. పరిస్థితి చేయి దాటకుండా పోలీసులు జోక్యం చేసుకొని చక్కదిద్దారు. ఇటీవల జనవరి ఫస్ట్ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ ఫొటోతో పాటు తమ ఫొటోలతో ఆయన వర్గీయులు జ్యోతిసర్కిల్‌లో ఫ్లెక్సీలు పెట్టారు. శనివారం మంత్రి రాక సందర్భంగా జయచంద్రారెడ్డి వర్గీయులు తమ ఫ్లెక్సీలను శంకర్ ఫ్లెక్సీలపై కట్టడానికి ప్రయత్నించారు. దీనిపై శంకర్ వర్గీయులు తీవ్ర అభ్యంతరం చెబుతూ అడ్డుకున్నారు. శంకర్ ఫ్లెక్సీలో సీఎం చంద్రబాబు, పవన్‌ల ఫొటోలున్నాయని దాని మీద ఎలా కడతారన్నారు. పైగా కట్టబోతున్న ఫ్లెక్సీలో ప్రోటోకాల్ మేరకు బి.కొత్తకోట మండల కన్వీనర్, టౌన్‌కన్వీనర్ ఫొటోలు కూడా లేవని, మా టౌన్‌లో మీ పెత్తనం ఏంటని అన్నారు. దీంతో వివాదం ముదిరింది. ఇంతలో పోలీసుల జోక్యంతో ఫ్లెక్సీని మరోచోట కట్టుకోవడంతో వివాదం ముగిసింది.

మంత్రి మండిపల్లెకు ఘనస్వాగతం



కర్ణాటక సరిహద్దు తాటిగల్లులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు జయచంద్రారెడ్డి, మల్లికార్జుననాయుడు

మదనపల్లె, జనవరి 4(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె, తంబళ్లపల్లె పర్యటనకు విచ్చేసిన రవాణా శాఖ మంత్రి మండిపల్లె రాం ప్రాదిరెడ్డికి టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కోపూరి మల్లికార్జుననాయుడులు ఆధ్వ ర్యంలో శనివారం పార్టీశ్రేణులు ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులోని తాటిగల్లు క్రాస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచాపేల్చి, పూలమాలతో ఘనస్వాగతం పలికారు. బెంగళూరు నుంచి సరిహద్దుకు చేరుకున్న మంత్రితోపాటు మల్లికార్జుననాయుడు, జయచంద్రారెడ్డిలను పూలమాలలతో ముంచెత్తారు. అక్కడ నుంచి ర్యాలీగా బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, ములకలచెరువుకు చేరుకున్నారు. మూడు మండలాల్లోనూ కూటమి పార్టీల శ్రేణులు మంత్రిని అనుసరించారు. ఇందులోభాగంగా బి.కొత్తకోట, పీటీఎం, ముకలచెరువు మం డలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకా న్ని ప్రారంభించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం మదనపల్లెకు చేరు కున్నారు. కార్యక్రమంలో పార్టీమండలాధ్యక్షులు సురేంద్రనాయుడు, రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్ర, పార్టీనేతలు సురేష్, కేవీరమణ, కిట్టన్న, పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులకు గాయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని వేంపల్లె సమీపంలో బెంగళూరు రోడ్డులో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో తండ్రి, కుమారుడు గాయపడ్డారు. బాధితులు వివరాల మేరకు వేంపల్లె గ్రామం గుట్టకిందపల్లెకు చెందిన హరికృష్ణ, తన భార్య దీపికా తోపాటు తన ఇద్దరి కుమారులతో బైక్‌పై మదనపల్లె పట్టణానికి వచ్చి వెళుతుండగా వేంపల్లె వద్ద మదనపల్లె ఆర్టీసీ బస్సు ఢీ కొట్టి వెళ్లిపోయింది. దీంతో గాయపడిన తండ్రి హరికృష్ణ(35) కుమా రుడు మహస్విన్(3)లను స్థానికులు చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.